PDF Compressor Free Version

Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 06.12.2013, శుక్రవారం
సంపుటి : 33 సంచిక : 27
పేజీలు : 12, వెల : ₹ 4




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

# రియల్ తెలంగాణ



- రాయలతెలంగాణకు తెరపడింది
- ఇక వేగంగా విభజన బిల్లు
- పదిజిల్లాల తెలంగాణకు కేంద్ర కేబినెట్ ఆమోదం
- 45రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధాని

రాష్ట్ర విభజన అంటే ఇంత ఛండాలంగా... ఇంత నికృష్టంగా, ఇంత దరిద్రంగా ఉంటుందనుకుంటే ఏ ప్రాంతంవాళ్ళు కూడా కొత్త రాష్ట్రం కావాలని అడగరేమో! ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనపై కేంద్రం వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే రోత కలుగుతుంది. చేయ డానికి చేతకానప్పుడు చేతకానట్లే ఉండాలిగాని అన్నీ చేతైన పాలిగాళ్ళలా, పోటుగాళ్ళలా ముందుకుపోవడమెందుకు?

ఇక్కడ ప్రజలు, ప్రాంతాల ప్రయోజనాల దృష్టితో రాష్ట్ర విభజన వ్యవహారం జరగడంలేదు. కేవలం కాంగ్రెస్ రాజకీయ ప్రయోజనా లను ఆశించే విభజనకు పూనుకుంది. రాష్ట్ర విభజనపై 13జిల్లాల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. రాష్ట్రమే అగ్ని కుంపటిలా తయారైంది. సరే ఇంత చేసి విభజన ప్రక్రియనన్నా సక్రమంగా తగలబెడుతున్నారా అంటే అదీ లేకుండాపోయింది. రాష్ట్రాన్ని ఏ విధంగా విభజించాలో తెలియక ఏదేదో చేసేస్తున్నారు. తాము గందరగోళానికి గురవడమేకాక ఇరుప్రాంతాల ప్రజలను గందరగోళ్ళస్థితిలోకి నెట్టేస్తూ వచ్చారు.

గత కొన్ని రోజులుగా రాయలతెలంగాణ అంశాన్ని చర్చల్లోకి వదిలి రాష్ట్రంలో గందరగోళం రేపిన కేంద్రప్రభుత్వం, ఎట్టకేలకు ఓ ముందడుగు వేసింది. రాయల వివాదానికి తెరదించుతూ 10 జిల్లాలతో కూడిన తెలంగాణ ఏర్పాటుకే కేంద్ర కేబినెట్ 5వ తేదీన ఆమోదం తెలిపింది. సిడబ్ల్యూసిలో తీసుకున్న నిర్ణయం మేరకే తెలంగాణ ఏర్పాటుకు ముందడుగు వేసింది. (మిగతా 10వ పేజీలో)

## నెల్లూరుజిల్లాలో డిఆర్‌డబ్ల్యూ - ఎన్‌బికెఆర్ - జవహర్‌భారతి మూడు స్వయంప్రతిపత్తి యూనివర్శిటీలు

12లో



## జగనన్న వదిలిన బాణం ఎక్కడ..?

జగన్ 16నెలలు చంచల్‌గూడ జైలులో ఉన్నప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని అన్నీతామై నడిపించింది ఆయన తల్లి వైయస్ విజయమ్మ, చెల్లి షర్మిలలే! పార్టీని స్థాపించిన కొన్ని నెలలకే కాంగ్రెస్ అధిష్టానం జగన్‌పై అక్రమాస్తుల కేసులు పెట్టించి జైలుకు పంపింది. అధ్యక్షుడే జైలులో ఉంటే ఏ పార్టీ అయినా నడవడం కష్టమే. అదీ ఒక నెల రెండు నెలలంటే సరే... ఏకంగా 16నెలలు పార్టీ అధ్యక్షుడు జైల్లో ఉంటే పార్టీ కేడర్‌ను కాపాడడం మాటలు కాదు.

కాని విజయమ్మ, షర్మిలలు జగన్ బయట లేని లోటును కనపడనీయలేదు. మేమున్నామంటూ పార్టీ కేడర్‌కు ధైర్యం చెప్పారు. జగన్ జైలులో ఉన్నా ఉపఎన్నికల భారాన్ని వీళ్ళే నెత్తిన వేసుకున్నారు. ఉపఎన్నికలు జరిగిన అన్ని నియోజకవర్గాలలో పర్యటించి తమ అభ్యర్థుల విజయా నికి బాటలు వేసారు. ముఖ్యంగా షర్మిల అయితే పార్టీకి జగన్ జైలులో వున్నా బయట తన అన్న చూడాల్సిన బాధ్యతలు నెరవేర్చింది. జగన్ అరెస్ట్‌తో ఓదార్పుయాత్ర మధ్యలో ఆగిపోతే షర్మిల మరో ప్రజాప్రస్థానం పాదయాత్ర నిర్వహించింది. పల్లెపల్లెను పలుకరిస్తూ ప్రజలతో మమేకమైంది. పార్టీకి ప్రజామద్దతు కూడగట్టింది. ఆడపిల్ల ఆడపులిలా రెచ్చి పోయి కాంగ్రెస్, తెలుగు దేశంలను తన పదు నైన విమర్శలతో



(మిగతా 10వ పేజీలో)

## యువ నాయకత్వంలో...

# నిలువెత్తు మానవత్వం

## వైయస్సార్‌సీపీలోకి విపిఆర్



ప్రజలు కోరుకునే నాయకుడికి అండదండగా నిలవాలని, ప్రజలు మెచ్చే పార్టీకి తనవంతు సహకారం అందించాలనే లక్ష్యంతో ప్రజల బాగోగులు కోరుకునే మానవత్వానికి నిలువెత్తు ప్రతిరూపం వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరడం జరిగింది. ఈ నెల 4వ తేదీన చెన్నైలో వై.యస్. అనిల్‌రెడ్డి ఇంట్లో వైకాపా అధినేత వై.యస్. జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆ పార్టీలో చేరారు.

(మిగతా 10వ పేజీలో)

PDF Compressor Free Version



# మిగులు రాకుంటే దిగులే!



## జిల్లాకు ప్రాణసంకటంలా బ్రిజేష్‌కుమార్ తీర్పు

**కృష్ణాజలాల వివాదంపై జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పు మన జిల్లా రైతాంగానికి శరాఘాతంగా మారనుంది. ఈ తీర్పుతో నష్టపోయే జిల్లాల్లో నెల్లూరు జిల్లా ప్రధానంగా ఉండబోతుంది. అన్నదాత గుండెపై ఈ తీర్పు గునపంపోటు లాంటి దేనసుకోవచ్చు. జిల్లాలోని సోమశిల, కండ్లేరు ప్రధాన రిజర్వాయర్‌లు తెలుగుగంగ ప్రాజెక్ట్‌లోకి వస్తాయి. కృష్ణ మిగులజలాల ఆధారంగా రూపొందించినదే తెలుగుగంగ ప్రాజెక్ట్. కృష్ణ మిగులు జలాలు రాకుంటే ఈ రిజర్వాయర్‌లను ఎండబెట్టుకోవాల్సిందే!**

సోమశిల రిజర్వాయర్ పేరుకు పెన్నానది మీద వున్నా ప్రతి ఏటా దీనిని నింపేది శ్రీశైలం నుండి విడుదల చేస్తున్న కృష్ణ మిగులు జలాలతోనే! దివంగతనేత వై.యస్.రాజశేఖరరెడ్డి హయాంలో పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ పెంచి దీనిద్వారా సోమశిలకు నీళ్ళు వదలడం జరుగుతుంది. వైయస్ హయాంలోనే సోమశిల సామర్థ్యాన్ని 74టీఎంసీలకు పెంచడం జరిగింది. గత అయిదారేళ్ళుగా సోమశిలను కృష్ణ నీటితోనే నింపుతున్నారు. సోమశిల నుండి కండ్లేరు రిజర్వాయర్‌కు నీటిని తరలించడం, అక్కడ నుండి కె.పి కెనాల్ ద్వారా చెన్నైకు తాగునీళ్ళు అందించడం చేస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే గత కొన్నేళ్ళుగా జిల్లాలో రైతాంగాన్ని బ్రతికిస్తున్నది. ఇక్కడ పంటలు పండిస్తున్నది, ఈ జిల్లాలో చాలావరకు తాగునీటి అవసరాలు తీరుస్తున్నది కృష్ణమ్మ నీళ్ళే! పెన్నా డెల్టా క్రింద దాదాపు 3లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. సాధ్యమైనంతవరకు రెండుకార్ల పంటలకు నీళ్ళందిస్తున్నారు. కృష్ణ మిగులు జలాలను

(మిగతా 10వ పేజీలో)



దాగుడుమూతలు

మన రాష్ట్రంలో కేంద్రప్రభుత్వం నిర్మించతలపెట్టిన అతిపెద్ద ఓడరేవు నిర్మాణంపై ఇంకా సస్పెన్స్ వీడలేదు. పోర్టు ఎక్కడ? అనే ప్రశ్న ఇంకా మిగిలేఉంది.

# పోర్టు ఏ పట్నానికో?

**నెల్లూరుజిల్లా దుగరాజపట్నం వద్ద పోర్టును మంజూరుచేసి కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే ఇంతవరకు శంకుస్థాపన జరగలేదు. ఈలోపే మళ్ళీ ఇస్రో అభ్యంతరాలు, అటవీశాఖ అనుమతి, పర్యావరణశాఖ సందేహాలతో దుగరాజపట్నంకు పీటముడి పడిపోయింది.**

కేంద్రం మన రాష్ట్రంలో భారీ నౌకాశ్రయాన్ని నిర్మించతలపెట్టి మూడు ప్రాంతాలను పరిశీలనలోకి తీసుకుంది. విశాఖజిల్లా నక్కలపల్లి, ప్రకాశంజిల్లా రామాయపట్నం, నెల్లూరుజిల్లా దుగరాజపట్నంలను పరిశీలించారు. నేవీ అభ్యంతరాలతో నక్కలపల్లి ఎగిరిపోయింది. భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం(ఇస్రో) అభ్యంతరం వ్యక్తం చేయడంతో దుగరాజపట్నంను తప్పించి మొదట రామాయపట్నంను ఎంపిక చేసారు. రామాయపట్నం ప్రకాశంజిల్లాలోదే అయినా నెల్లూరు జిల్లాలోని కావలికి దగ్గరగా ఉంటుంది. ఇక్కడ పోర్టు అనగానే రియల్టర్‌లు పెద్దఎత్తున భూములు కొనుగోలు చేసారు. తద్వారా భూములధరలు విపరీతంగాపెరిగాయి. ఈ ప్రభావంతో కావలిపట్టణంలోనూ మార్కెట్‌లో కదలిక వచ్చింది. కొందరు వ్యాపారులైతే రామాయపట్నంకు వెళ్లే దారిలో స్టార్ హోటల్ నిర్మాణానికి కూడా ప్లాన్ చేసారు.

అయితే ఈలోపే తిరుపతి ఎంపీ చింతామోహన్‌తో పాటు జిల్లా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేసిన ప్రయత్నాలతో కేంద్రం రామాయపట్నం బదులు దుగరాజపట్నం వద్ద పోర్టు మంజూరుచేస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందుకు అవసరమైన భూసేకరణ జరపాలని రెవెన్యూ అధికారులను ఆదేశించడం, కేంద్ర బృందాన్ని పరిశీలనకు పంపడం జరిగింది. దుగరాజపట్నం వద్ద పోర్టు వస్తుందనే సరికి ఈ ప్రాంతంలో భూముల అమ్మకాలు, కొనుగోళ్ళు జోరందుకున్నాయి. రాజకీయ నాయకులు, బడా పారిశ్రామికవేత్తలు ఇక్కడ భూములపై పడ్డారు. ఈ వ్యవహారం ఇలా ఉండగానే మళ్ళీ పోర్టుపై అనుమానమేఘాలు కమ్ముకున్నాయి. దుగరాజపట్నం వద్ద పోర్టుకు ఇస్రో బలంగా అభ్యంతరం పెడుతుంది. ఇక్కడ పోర్టు పూర్తయ్యి కార్యకలాపాలు జరుగుతుంటే భద్రత పరంగా షార్‌కు ఇబ్బందేనని ఇస్రో చెబుతుంది.

కాని వారి సందేహాలను ప్రభుత్వం నివృత్తి చేయలేకపోతుంది. అలాగే దగ్గర్లో పులికాట్ సరస్సు ఉంది. అటవీశాఖ భూములున్నాయి. అటవీ, పర్యావరణ శాఖలు కూడా ఇక్కడ పోర్టుకు అభ్యంతరం పెడుతున్నాయి. దీంతో మరోమారు రామాయపట్నం తెరమీదకు వచ్చింది. మళ్ళీ రామాయపట్నం పేరు వినపడగానే గతంలో ఇక్కడ భూములు కొని తడిగుడ్డ నెత్తినేసుకున్న వాళ్ళకు ప్రాణం లేచివచ్చినట్లయ్యింది.

మొత్తానికి పెద్ద ఓడరేవు ఇరు ప్రాంతాల వారితో దాగుడుమూతలాడుతుంది. పోర్టు ఎక్కడ అనేది శంకుస్థాపన చేసాక గాని క్లారిటీ తెచ్చుకోలేరు.

# వైకాపా సిఇసి మండలిలో బొమ్మిరెడ్డి, పాపకన్ను





# ఇవి గౌతం ఖాతాలోవే!

**క్రియాశీలక రాజకీయాలలోకి అడుగుపెట్టిన మేకపాటి గౌతంరెడ్డి అడుగుల వేగం పెంచాడు. వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ కీలక విభాగమైన కేంద్ర కార్యనిర్వాహక మండలిలో తన మనుషులిద్దరికి చోటు ఇప్పించగలిగాడు. వైకాపా సిఇసి సభ్యులుగా ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, వెంకటగిరి నియోజకవర్గానికి చెందిన పాపకన్ను రాజశేఖర్‌రెడ్డిలను నియమించారు.**

ఆత్మకూరు మాజీఎమ్మెల్యే డాక్టర్ బి.సుందరరామిరెడ్డి కొడుకు రాఘవేంద్రరెడ్డి. 2006లో ఏ.ఎస్.పేట జడ్పీటీసీగా గెలిచాడు. 2007లో స్థానికసంస్థల శాసనమండలి నియోజకవర్గం నుండి కాంగ్రెస్ తిరుగుబాటు అభ్యర్థిగా పోటీచేసి సంచలన విజయం సాధించాడు. ఆ తర్వాత ప్రజారాజ్యంపార్టీలో చేరి కొంతకాలం జిల్లా కన్వీనర్‌గా పనిచేసాడు. జగన్ వైయస్సార్‌కాంగ్రెస్‌పార్టీని స్థాపించాక ఆ పార్టీలో చేరారు. రేపు ఆత్మకూరు నుండి గౌతం పోటీచేస్తే రాఘవ సహకారం కీలకం కాగలదు. అలాగే రాపూరు మండలం ఏపినాపికి చెందిన పాపకన్ను రాజశేఖర్‌రెడ్డి గౌతంకు దగ్గరిబంధువు. ఈయన పెంచలకోన ట్రస్ట్‌బోర్డు ఛైర్మెన్‌గా పనిచేసారు. కాంగ్రెస్, తెలుగుదేశంపార్టీలను చుట్టేసి ప్రస్తుతం వైకాపాలో ఉన్నాడు. వెంకటగిరి టిక్కెట్ మీద గంపెడాశలు పెట్టుకున్నాడు. అయితే అక్కడ కొమ్మి ఉండడంతో ఈయనను సిఇసి సభ్యత్వంతో సంతృప్తి పరిచారు.

# తొముక్కున్నారు

**వారంరోజులు చేయాల్సిన పని ఒకరోజులో చేయాల్సి వస్తే... మూడుపూటలా తినాల్సిన తిండి ఒకపూటలో తినాల్సివస్తే... ఎవరికైనా భారంగానే ఉంటుంది. ఇప్పుడు స్కూళ్లలో అయ్యోర్లు, విద్యార్థుల పరిస్థితి ఇలాగే ఉంది. ఆదివారాలు కూడా పనిదినాలు కావడం, సెలవులంటూ లేకపోవడంతో అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు మానసిక ఒత్తిడితో నలిగిపోతున్నారు.**

జీవితం ఒక క్రమశిక్షణచట్రంలో తిరుగుతుంటుంది. పనిచేసే టైంలో పనిచేయాలి, తినేటైంలో తినాలి. నిద్రపోవాల్సిన టైంలో ఆ పని చేయాలి. అవకాశం వచ్చింది కదా అని ఏ మనిషి కూడా 24గంటలూ తినలేడు, పనిచేయలేడు. అలాగని నిద్ర కూడా పోలేడు.

కాని సమైక్యాంధ్ర ఉద్యమఫలితంగా అయ్యోర్లకు, విద్యార్థులకు ఆ పరిస్థితి వచ్చింది. రాష్ట్ర విభజన చిచ్చుతో దాదాపు రెండునెలల పాటు జిల్లాలో చదువులు సక్రమంగా సాగలేదు. ఏరోజు ఎవరు బంద్ చేస్తారో తెలియని పరిస్థితి. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను, కళాశాలలను నిరవధికంగా మూసివేసారు. ఎక్కడి సిలబస్ అక్కడే ఆగిపోయింది. ఆందోళనల మూలంగా వచ్చిన సెలవులను ఉపాధ్యాయులు, పిల్లలు వినియోగించుకున్నారా అంటే అదీలేదు. సిలబస్ కాకపోవడంతో ఏం చదువుకోవాలో అర్థంకాక విద్యార్థులు ఆటపాటల్లో గడిపారు. అధికారిక సెలవులు లేకపోవడంతో ఉపాధ్యాయులు విధిగా ఆందోళనలు సాగినరోజుల్లో కూడా పాఠశాలలకు వెళ్ళి సంతకాలు పెట్టి రావాల్సివచ్చింది. ఆందోళనల మూలంగా వచ్చిన సెలవులను వాళ్ళు వాడుకున్నది లేదు.

ఆందోళనలు ముగిసి విద్యాసంస్థలు సాఫీగా నడవసాగాక కొండలా పేరుకుపోయిన సిలబస్‌ను కరగదీసే ప్రయత్నానికి విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. ఈ పరంపరలో అసలు సెలవులే లేకుండా చేసింది. వారంలో ఒకరోజు సెలవొస్తే కొంత ప్రశాంతంగా వుండేది. మానసికంగా కొంత ఉపశమనం కలిగేది. కాని ఇప్పుడు రిలీఫ్ అన్నది లేదు. పరుగుల జీవితం అయ్యింది. ఉపాధ్యాయులు యాంత్రికంగా పనిచేస్తున్నారు. విద్యార్థులు కూడా సిలబస్‌ను మింగేయడానికి రోబోట్‌లుగా కుస్తీ పడుతున్నారు.

# స్కానర్లతో... 'చెక్'పెట్టాలి...



- రైళ్ళు, బస్సులలో తనిఖీలు చేయాలి

**ఉగ్రచర్యలు, విద్రోహచర్యలు ఎప్పుడు ఎక్కడ ఏ రూపంలో ముంచుకొస్తాయో తెలియని పరిస్థితి. ఏ బ్యాగులో ఏముందో, ఏ సూట్‌కేసులో ఏ ప్రమాదముందో ఎవరు పసిగట్టగలరు. నిరంతర నిఘా, ముమ్మర తనిఖీలతోనే వీటిని కొంతవరకు ఎదుర్కోగలం.**

ఈమధ్యకాలంలో బస్సులు, రైళ్లలో కూడా ప్రయాణం ప్రమాదాల అంచున కొనసాగుతుండడం చూస్తున్నాము. బస్సుల్లో లేదా రైళ్లలో ఎవరు ఏ లగేజీతో ఎక్కుతున్నారో తెలుసుకునే పరిస్థితి లేకుండా పోయింది. సాధారణ ప్రయాణీకుల్లాగే విద్రోహులు కూడా లగేజీతో ఎక్కుతారు. వాళ్ల లగేజీలో పేలుడు పదార్థాలు వంటివి ఉంటాయి. సాధారణ ప్రయాణీకులలాగే వాళ్ళు లగేజీని అక్కడే వదిలేసి దిగిపోతారు. తర్వాత తమదైన శైలిలో విధ్వంసం సృష్టిస్తారు. దేశంలో పలు సందర్భాలలో రైళ్లలో పేలుళ్లు జరిగిన సంఘటనలు లేకపోలేదు. ఇలాంటి ప్రమాదాలు బస్సులకు కూడా పొంచిఉన్నాయి. ఏ.సి, సూపర్‌లగ్జరీ వంటి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో అడుగు భాగంలో లగేజీ వేస్తుంటారు. ఆ బ్యాగుల్లో ఏ వస్తువులు ఉన్నాయో బస్సు సిబ్బంది చూడరు. ప్రయాణీకుడు సీటు నెంబర్ చెప్పేస్తే బ్యాగును బస్సు క్రిందిభాగంలో పెట్టేస్తారు. బ్యాగు అందించిన వ్యక్తి వద్ద టిక్కెట్ ఉందా, అతను బస్సు ఎక్కుతున్నాడా లేదా అనేది చూసే పరిస్థితి కూడా ఉండదు. ఇలా తనిఖీలు లేకుండా లగేజీ వేసుకుంటే ఆ లగేజీలలో పేలుడు పదార్థాలు ఉండవచ్చు. లేదంటే స్మగ్లింగ్ వస్తువులు ఉండవచ్చు. ప్రస్తుత కాలంలో స్మగ్లింగ్ ఎక్కువగా జరుగుతుంది బస్సుల ద్వారానే! అలాగే రైళ్ల ద్వారా గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణా జరుగుతుంది. రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు తిరుగుతున్నాయి. వీటి ద్వారా కూడా పేలుడు పదార్థాలు, లేదా స్మగ్లింగ్ వస్తువులు రవాణా అవుతుంటాయి.

వీటిని అరికట్టాలంటే ప్రధాన బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్‌లలో స్కానర్ల ఏర్పాటు తప్పనిసరి చేయాలి. ఎయిర్‌పోర్టులలో లగేజీని స్కానర్ల ద్వారా తనిఖీ చేసాక ట్యాగ్ తగిలిస్తారు. అలా ట్యాగ్ వున్న లగేజీనే విమానంలోకి అనుమతిస్తారు. ప్రధానబస్టాండ్‌లు, రైల్వేస్టేషన్‌లలో ముందు విడతగా స్కానర్లను ఏర్పాటు చేయాలి. స్కానర్ల ద్వారా తనిఖీ చేసి ట్యాగ్‌లు వేసిన లగేజీని మాత్రమే రైళ్లలో, లేదా బస్సుల్లో ప్రయాణానికి అనుమతించాలి. ఇది పెద్ద సమస్య కూడా కాదు. ఉగ్రవాద విద్రోహులు, ప్రమాదాలు పెరుగుతున్న దృష్ట్యా రైల్వేశాఖ గాని, ఆర్టీసీ గాని భద్రతపై దృష్టి సారించాల్సి వుంది. స్కానర్ల ఏర్పాట్లు ద్వారా స్మగ్లింగ్‌ను అరికట్టడంతో పాటు ప్రమాదాల నుండి కాపాడుకోవచ్చు.

## 'తెలుగు' కీర్తి పురస్కారం అందుకున్న
# చిన్ని నారాయణరావు


కీర్తిపురస్కారాన్నందుకుంటున్న చిన్ని నారాయణరావు

నెల్లూరు నుంచి తొలిసారిగా వచన కవిత్వానికి నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి చిన్ని నారాయణ రావుకు తెలుగు యూనివర్సిటీ కీర్తి పురస్కారం లభించింది. హైదరాబాదు తెలుగు యూనివర్సిటీ నందమూరి తారక రామారావు ఆడిటోరియంలో 28వ వైభవంగా జరిగిన కీర్తి పురస్కార సభలో రాజీవ్ యుపకిరణాలు ఛైర్మన్ ఆచార్య కె.సి.రెడ్డి, తెలుగు యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ఆచార్య ఎల్లూరు శివారెడ్డి, రిజిస్ట్రార్ ఆశీర్వాదం, రిటైర్డ్ సాంస్కృతికశాఖ కార్యదర్శి కె.వి. రమణాచారి పాల్గొని ఈ కీర్తి పురస్కారాన్ని అందించారు. ఆడిటరుగా వుండి తెలుగు కవిత్వంలో కీర్తి పురస్కారాన్ని అందుకోవడం అభినందనీయం అని చిన్ని నారాయణరావును కె.సి.రెడ్డి అభినందించారు. ప్రభుత్వాలు ఇచ్చే పురస్కారాలకంటే విశ్వవిద్యాలయాలు ఇచ్చే పురస్కారాలు విలువైనవని ప్రామాణికతకు అద్దం పడతాయని కె.సి.రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎల్లూరు శివారెడ్డి, కె.వి.రమణాచారి పాల్గొని ప్రసంగించారు.

## ఆనం అక్రమాలపై పోరాటం చేస్తా
**- కాకాణి**



రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అక్రమాలపై పోరాటం చేస్తానని వైయస్సార్‌సిపి సిఈసీ సభ్యుడు సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త కాకాణి గోవర్థన్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు జిల్లా తోటపల్లి గూడూరు మండలం వరకవిపూడి పంచాయతీలో సమైక్య దీవెన యాత్రలో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో మంత్రి ఆనం ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారన్నారు. కండలేరు అభివృద్ధి సాకుతో రూ.890 కోట్లకు కాంట్రాక్టులు పిలిపించి ఏకంగా రూ.1520 కోట్లకు ప్రభుత్వం ఆమోదం పొందడం వెనుక మంత్రి ఆనం అవినీతి లేదా అని ప్రశ్నించారు. ఈ అభివృద్ధి పేరుతో కోట్లాది రూపాయలు కొల్లగొట్టడం వాస్తవంకాదా అని కాకాణి ప్రశ్నించారు. మంత్రి రామ నారాయణరెడ్డి అవినీతి, అక్రమాలపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానన్నారు. వేనాటి జితేంద్రరెడ్డి, తూపిలి శ్రీధర్‌రెడ్డి, ఉప్పల శంకరగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమైక్య దీవెన యాత్రలో పార్టీ మండల కన్వీనర్ టంగుటూరు పద్మనాథరెడ్డి, మాజీ ఎంపిపి టంగుటూరు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పార్క్ పాడైపోతుంది...
# పట్టించుకోండి...


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వాకర్స్ సభ్యులు

నెల్లూరులోని చిల్డ్రన్స్ పార్క్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఈనెల 2న చిల్డ్రన్స్ పార్క్‌లో నెలకొన్న సమస్యలపై జిల్లా కలెక్టర్ శ్రీకాంత్‌ను కలిసి వినతి పత్రాన్ని అందించారు. అసోసియేషన్ కార్యదర్శి పాముల రమణయ్య, సభ్యులు ఓగూరు నాగేశ్వరరావు, టి.వి. నటులు శింగంశెట్టి మురళీమోహన్, పంట్రంగి వెంకటేశ్వర్లు, నరేష్, సాయిరాం శ్రీనివాస్, గుడ్డేటి ప్రసాద్, శ్రీధర్ తదితరులు కలెక్టర్‌ను కలిసి పార్క్ దుస్థితిని వివరించి పరిష్కరించమని కోరారు. చిల్డ్రన్స్ పార్క్ మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహణలో వుంటూ కనీస వసతుల లేమితో కునారిల్లుతోందని విన్నవించారు. పార్క్‌లో గడ్డిని కట్ చేయకపోవడంతో పెరిగిన గడ్డిలో పాములు సంచరిస్తున్నందున సందర్శకులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వాకర్స్ నడిచే ట్రాక్‌కు టెండర్లు పిలిచి పని మొదలు పెట్టలేదని, సిబ్బంది జీతాలు 6నెలల నుంచి ఆపివేశారని, 2సంవత్సరాలుగా స్విమ్మింగ్‌పూల్‌ను నిరుపయోగంగా చేసేసారని పేర్కొన్నారు. పిల్లలు ఆడే ఆటవస్తువులు కూడా పాడై పోయాయని, ఇలా ఎన్నో సమస్యలతో సతమతమవుతున్న చిల్డ్రన్స్ పార్క్‌ను తక్షణమే స్పందించి కాపాడమని వారు కోరారు.

# రాయల పౌరుషాన్ని రెచ్చగొట్టొద్దు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానందరెడ్డి

రాయలసీమ సంస్కృతిని విచ్ఛిన్నం చేయడానికే రాయలతెలంగాణ అంటున్నారని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ధ్వజమెత్తారు. ఈ నెల 4వతేదీన నెల్లూరులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రజలు సమైక్యాంధ్ర కోసం పోరాడారేగాని రాయలతెలంగాణ కోసం కాదన్నారు. జె.సి.దివాకర్‌రెడ్డి బస్సుల కోసం, టిజి వెంకటేష్ ఫ్యాక్టరీల కోసం రాయలతెలంగాణకు మద్దతు తెలుపుతున్నారన్నారు. వీరిలో రాయలసీమ పౌరుషం ఏమైందని ప్రశ్నించారు. రాయల తెలంగాణ వస్తే నెల్లూరు, కడపజిల్లాలు ఎడారులుగా మారడం ఖాయమన్నారు. రాయలతెలంగాణను ఎట్టిపరిస్థితుల్లోనూ రానీయమన్నారు.

నెల్లూరురూరల్, నగరం నియోజక వర్గాలలో రచ్చబండ విజయవంతమైందని, అన్ని పార్టీల వారు సహకరించారని వివేకా అన్నారు. ఈ రెండు నియోజక వర్గాలలో 23చోట్ల కార్యక్రమాలు నిర్వహించాం. 36,447కుటుంబాలకు రేషన్ కార్డులు, 2156మందికి పింఛన్‌లు, 2900 మందికి ఇందిరమ్మ ఇళ్ళు, 156 మందికి అభయహస్తం పథకాన్ని అందించామన్నారు. ఈ సమావేశంలో నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, డీసీసీ ఇన్‌ఛార్జ్ అధ్యక్షులు చాట్ల నరసింహారావు, హిందిసురేష్, సన్నపరెడ్డి పెంచలరెడ్డి, జ్యోతి, బర్నాబాసు తదితరులు పాల్గొన్నారు.

# మరుపురాని నేత మాగుంట సుబ్బరామరెడ్డి


మాగుంట సుబ్బరామరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇక సెలవు అంటూ తిరిగిరాని లోకాలకు తాను తరలిపోయి ఒకటిన్నర దశాబ్దం గడిచిపోయినా మరుపురాని నేతగా మహనీయతను స్వంతం చేసుకున్న మహానుభావుడు మాగుంట సుబ్బరామిరెడ్డి 18వ వర్థంతిని నెల్లూరు రంగనాయకులపేటలోని రాఘవ కల్యాణమండపంలో ఘనంగా జరిపారు. మాజీ శాసన సభ్యులు సి.వి.శేషారెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పి.అరుణమ్మ కేంద్ర సెన్సారుబోర్డు సభ్యులు ప్రమిద శ్రీనివాసులు, యువజన కాంగ్రెస్‌జిల్లా మాజీ అధ్యక్షుడు పి.కోటేశ్వరరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు టి.బాలసుధాకర్, కాంగ్రెస్ నాయకులు పత్తి రవీంద్రబాబు, రఘురామ్ ముదిరాజ్, పూండ్ల పిచ్చిరెడ్డి, కువ్వారపు రమణమ్మ, కె.శ్రీనివాసులునాయుడు, వి.చంద్రమౌళి, యేసునాయుడు తదితరులు పాల్గొని మాగుంట సుబ్బరామరెడ్డి చిత్రపటానికి పూలమాలలు అలంకరించి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా పేదలకు అన్నదానం చేసారు.

# క్రైం తగ్గించేందుకు సీసీఎస్ బలోపేతం

**గుంటూరురేంజ్ ఐజి సునీల్‌కుమార్**



నేరాల నియంత్రణకు నెల్లూరు సీసీఎస్‌ను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు గుంటూరురేంజ్ ఐజి సునీల్‌కుమార్ చెప్పారు. ఈ నెల 4వ తేదీన నెల్లూరులోని గ్రామీణ డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది సీసీఎస్‌కు ఓ క్రైం ఏఎస్పీని నియమించే యోచనలో వున్నట్లు చెప్పారు. జిల్లాలో ఎక్కడైనా నేరాలు, చోరీలు, దోపిడీలు జరిగితే ఎస్పీ నేతృత్వంలో సీసీఎస్ అధికారులు దర్యాప్తు చేపడుతారన్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు పోలీస్ అవుట్‌పోస్ట్‌లను ఏర్పాటు చేసేదిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలీసువాహనాల కొరత, డయల్ 100 వాహనాల ఏర్పాటుకు ఎస్పీ రామకృష్ణ డిజిపి కార్యాలయానికి ప్రతిపాదనలు పంపారని, త్వరలోనే జిల్లాకు అవి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. రేంజ్ పరిధిలో రెండేళ్లకుపైగా వున్న సిఐలను, ఇతర ఆరోపణలున్న సిఐలను బదిలీ చేయనున్నట్లు చెప్పారు. అలాగే త్వరలో ఎస్ఐల బదిలీలు కూడా ఉంటాయని చెప్పారు. పరిపాలనా సౌలభ్యం కోసం గుంటూరు రేంజ్ కార్యాలయాన్ని హైదరాబాద్‌కు మారుస్తున్నట్లు చెప్పారు. ఈ రేంజ్‌లో ఒక డిఐజి నెల్లూరు, ప్రకాశం జిల్లాలను చూస్తారని, మరో డిఐజి గుంటూరుజిల్లా, అర్బన్‌జిల్లాలను చూస్తారని తెలిపారు. సిఐలు శాంతిభద్రతల విభాగంలోనే పోస్టింగ్ కోరుకుంటుండడం, పోలీస్‌శాఖలో భాగమైన రైల్వే, సిఐడి, ఏసిబి, మెరైన్‌లకు వెళ్ళడం లేదని, దీంతో ఎక్కువమంది విఆర్‌లో ఉంటున్నారని అన్నారు. నెల్లూరులో శిథిలావస్థకు చేరిన పోలీస్‌క్వార్టర్స్‌ను కూల్చి వాటి స్థానంలో కొత్తవాటిని నిర్మించేందుకు పోలీస్‌హౌసింగ్ అధికారులతో మాట్లాడుతానన్నారు.

ఈ సమావేశంలో ఎస్పీ పి.వి.యస్. రామకృష్ణ, ఏఎస్పీ ఐఆర్ఎస్ మూర్తి, డిఎస్పీ రాంబాబు పాల్గొన్నారు.

## స్వామి వివేకానంద తిరిగి జన్మించాలి
**- డాక్టర్ శ్రీనివాసరాజు**




నెల్లూరు పురమందిరంలో నెల్లూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో స్వామివివేకానంద 150వ జయంతి సభ జరిగింది. సభకు నెరసం అధ్యక్షులు ఎ.జయప్రకాష్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా డాక్టర్ శ్రీనివాసరాజు, మోహన్ రాజులు, సామంతు గోపాల్‌రెడ్డి, ఐర్లాండ్ తెలుగు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు యన్.చంద్రకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. డాక్టర్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో స్వామి వివేకానంద తిరిగి జన్మించాల్సిన అవసరం ఎంతైనా వుందని పేర్కొన్నారు. ప్రపంచదేశాలలో హిందూధర్మ వ్యాప్తికి ఆయన ఎంతోకృషి చేసారన్నారు. సభలో నెరసం ప్రచురణ "సాహితీ నేస్తం" మాసపత్రికను కవయిత్రి ములుగు లక్ష్మి మైథిలి రచించిన "ఊహలు గుసగుసలాడే" పుస్తకాన్ని ఆవిష్కరించారు. స్వామి వివేకానంద జయంతి వేడుకల సందర్భంగా పలు పాఠశాలల్లో నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన, వేషధారణ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానం చేసారు. కార్యక్రమంలో నెరసం ప్రధాన కార్యదర్శి మాటేటి రత్నప్రసాద్, సభ్యులు డి.టి.హరికృష్ణ, తిప్పావఝుల సుబ్రహ్మణ్యం, దంతవైద్యులు ఆదర్శ అనుముల తదితరులు పాల్గొన్నారు.

PDF Compressor Free Version

PDF Compressor Free Version
K






## పరిపక్వం ఎప్పుడు?

తెలంగాణ ప్రక్రియను ఆపి, రాష్ట్రాన్ని యథాతథంగా ఉంచాలని, సమైక్యంగా ఎందుకు ఉంచాలో, సమైక్యంగా ఉంచకపోతే ఇరు ప్రాంతాలకు జరిగే నష్టాలు, తెలంగాణ ప్రక్రియను కొనసాగించడానికి ఉన్న రాజ్యాంగపరమైన చిక్కులు వీటన్నింటిని పిటిషనర్లు తమ పిటిషన్లో వివరించారు. ధర్మాసనం కేసులు వాదించడానికి ఇది పరిపక్వ దశ కాదు అన్నది. పరిపక్వ దశ ఏదో ధర్మాసనం చెప్తే అప్పుడే కేసులు వేస్తారు. పరిపక్వదశ అంటే 1) తెలంగాణ ఏర్పడ్డాకా? 2) పార్లమెంటులో బిల్లు పాసయ్యాకనా? 3) బిల్లు రాష్ట్రపతి వద్దకు వెళ్ళినప్పుడా? ఏది పరిపక్వ దశ? ధర్మాసనం ధర్మసందేహాల్ని తీర్చాలి.

కురుగూరు రంగనాథం,
నెల్లూరు.

## నాయకులారా... నోర్లు విప్పండి

మహాభారతంలో గాంధారి కళ్లకు గంతలు కట్టుకున్నట్లు మన జిల్లా నాయకులు నోర్లకు గుడ్డలు కట్టుకుంటే ప్రజలు సహించరు. అన్ని జిల్లాల నాయకులు కొత్త ప్రాజెక్టులు సాధించుకుంటుంటే మన జిల్లా నాయకులు ఉన్నది ఊడ్చుకుపోతున్నా పట్టించుకోవడం లేదు. బిట్రగుంట రైల్వే అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇఫ్‌కో సెజ్ శంకుస్థాపనతో ఆగిపోయింది. కృష్ణపట్నం, ఓబులాపురం రైల్వేలైన్ సర్వేలను దాటడం లేదు. మన జిల్లా అభివృద్ధిని వదిలేసి హైదరాబాద్‌ను పట్టుకుని వేలాడడం సబబుకాదు.

నలుబోలు రామ్మోహన్‌రెడ్డి,
చెన్నై.

## రాయలతెలంగాణతో నష్టం

కాంగ్రెస్‌పార్టీ తన రాజకీయ స్వార్థం కోసం రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తుంది. ఇప్పుడు రాయలతెలంగాణ వాదాన్ని తెరమీదకు తెచ్చింది. ఇదే జరిగితే శ్రీశైలం ప్రాజెక్ట్‌రాయల తెలంగాణలోకే పోతుంది. గుంటూరు, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కడప జిల్లాలు ఎడారులుగా మారడం ఖాయం. శ్రీశైలం నీళ్ళు చుక్క కూడా మనకు రావు.

జి.యస్.రావు, నెల్లూరు.

## 'ప్రభా'తం

## రాష్ట్రానికి శని పట్టింది



**పచ్చగా ఉన్న ఈ రాష్ట్రానికి ఎవరి దిష్టి తగిలిందో ఏమోగాని నిలువునా మండిపోతుంది. ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ప్రశాంతంగా వున్న ఈ రాష్ట్రంలో విభజన చిచ్చు పెట్టింది ఇటలీ మహాతల్లి సోనియాగాంధీ. ఆమె పెట్టిన చిచ్చుకు రాష్ట్రం అభివృద్ధిలో పాతికేళ్ళు వెనక్కిపోయింది.**

కాలం, గ్రహచారం వంటివి మూఢనమ్మకాలనుకోవచ్చునేమో గాని, కొన్నిసార్లు ఇలాంటివాటిని నమ్మే పరిస్థితులు వస్తుంటాయి. వరుసబెట్టి మంచి జరుగుతుంటే వాడంతటి అదృష్టవంతుడు లేడంటారు. వరుసబెట్టి చెడు జరుగుతుంటే అది వాడి దరిద్రమంటారు. వాడి గ్రహస్థితులు బాగాలేవంటారు. ఇప్పుడు మన రాష్ట్రానికి కూడా అలాంటి గ్రహస్థితి ఏదో బాగాలేనట్లుంది. లేకపోతే ఈ దరిద్రమంతా ఏంటి. దేశంలోని ఎక్కువ రాష్ట్రాలతో పోలిస్తే అభివృద్ధిలో మనం ఎంతో ముందున్నాం. పాడిపంటలు, పరిశ్రమలు, వ్యాపారాలు, మంచి నాగరికత, మంచి సంప్రదాయాలు, మంచి సంస్కృతి... దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌కు ఒక ప్రత్యేకగుర్తింపు వుంది.

పచ్చగా ఉన్న ఈ రాష్ట్రానికి ఎవరి దిష్టి తగిలిందో ఏమోగాని నిలువునా మండిపోతుంది. ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ప్రశాంతంగా వున్న ఈ రాష్ట్రంలో విభజన చిచ్చు పెట్టింది ఇటలీ మహాతల్లి సోనియాగాంధీ. ఆమె పెట్టిన చిచ్చుకు రాష్ట్రం అభివృద్ధిలో పాతికేళ్లు వెనక్కిపోయింది. ప్రజలకు మనశ్శాంతి కరువైంది. అశాంతితో రాష్ట్ర ప్రజానీకం అల్లాడుతుంది. అన్ని రకాల కార్యకలాపాలు స్థంభించి పోయి నష్టం వేలకోట్లకు చేరుకుంది. పరిపాలన పూర్తిగా కుంటుపడిపోయింది. రాజకీయ అస్థిరత్వం రాష్ట్రంలో రాజ్యమేలుతుంది. మొదలే విభజన చిచ్చుతో రాష్ట్రం తగలబడిపోతుంటే గోటిచుట్టు మీద రోకటిపోటులా జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యూనల్ తీర్పు వచ్చింది. కృష్ణజల వివాదాల విషయంలో జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యూనల్ మన రాష్ట్రం నోట్లో మట్టికొట్టింది. ఆల్‌మట్టి ఎత్తు, మిగులుజలాల పంపిణీ సహా అన్ని విషయాలలోనూ ట్రిబ్యునల్ ముందు మన రాష్ట్రానికి చుక్కెదురయ్యింది. ఏ అంశాలలోనూ ఆంధ్రప్రదేశ్ వాదనల్లో పసలేదని ట్రిబ్యునల్ కొట్టి పారేసింది. ఆంధ్రప్రదేశ్ తరపున చేసిన ఏ వాదనమూ ట్రిబ్యునల్ పట్టించుకోలేదు. మనం ప్రతిపాదించిన ఒక్క సవరణకు కూడా ఆమోదం తెలపలేదు. ఇది ఏకపక్ష తీర్పులా వుంది. ఈ తీర్పుతో కర్నాటక, మహారాష్ట్రలలో సంబరాలు చేసుకుంటుంటే, మన రాష్ట్రంలో మాత్రం నిరాశ, నిస్పృహ ఆలుముకుంది. ఆల్మట్టి ఎత్తుతో పాటు కర్నాటక, మహారాష్ట్రలలో అక్రమంగా నిర్మిస్తున్న ప్రాజెక్టుల గురించి వివరించినా ట్రిబ్యునల్ దానిని పెడచెవిన పెట్టింది. మిగులుజలాల వాటాను కర్నాటక, మహారాష్ట్రలకే ఎక్కువగా కేటాయించడం ద్వారా ఆంధ్రాపై చిన్నచూపు చూసినట్లయ్యింది. 1894-1972ల మధ్య 78ఏళ్ల కాల వ్యవధిలో కృష్ణ నీటి ప్రవాహానికి సంబంధించిన వివరాలను లెక్కలోకి తీసుకుని 75శాతం విశ్వసనీయతతో లెక్కించి బచావత్ ట్రిబ్యునల్ కృష్ణ మిగులుజలాల హక్కును ఆంధ్రప్రదేశ్‌కే కట్టబెట్టింది. మిగులు జలాలలో ఎగువ రాష్ట్రాలకు వాటా వెళితే ఆంధ్రప్రదేశ్‌కు 75సంవత్సరాలలో రావాల్సిన నికరజలాలు రావని, తక్కిన పాతిక సంవత్సరాలలో నీటి లభ్యత మరింత దారుణంగా పడిపోతుందని బచావత్ ట్రిబ్యునల్ స్పష్టం చేసింది. అయితే బచావత్ దార్శనికతకు, వాస్తవికతకు తిలోదకాలిచ్చేలా బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పు పరిణమించింది. 2010డిసెంబర్ నాటి మధ్యంతర తీర్పుపై మన రాష్ట్రం 14సవరణలు కోరినా, అన్నింటిని తిరస్కరిస్తూ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పు మన గుండె మంటల్ని మరింతగా ఎగదోసింది.

కర్నాటక, మహారాష్ట్రలు రెండూ మొదటి నుండి నీటిపై దొంగనాటకాలాడుతూనే వున్నాయి. కావేరి జలాల విషయంలో జలమండలి ఆదేశాలను ధిక్కరించి కర్నాటక ఏ స్థాయిలో నీటి చౌర్యానికి పాల్పడుతుందో లోకం చూస్తూనే ఉంది. కృష్ణానదిపై అక్రమప్రాజెక్టుల నిర్మాణం, ఉన్న ప్రాజెక్టుల ఎత్తు పెంచడం ద్వారా మన రాష్ట్రానికి ఒక్క బొట్టు నీళ్ళు రాకుండా చేయడమే లక్ష్యంగా కర్నాటక పంతం పట్టుకు ఉంది. మహారాష్ట్ర సంగతీ ఇంతే! అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్‌లో అక్రమ ప్రాజెక్టులు కడుతున్నారంటూ కర్నాటక కోర్టు కెక్కడం తెలిసిందే!

జస్టిస్ బ్రిజేష్‌కుమార్ తీర్పు రాష్ట్ర రైతాంగానికి ఉరిశిక్ష లాంటిదే. బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులను కొనసాగిస్తూనే 65శాతం ఆహేతుక ప్రాతిపదికన కృష్ణలో 448 టీఎంసీలు అదనంగా నీటి లభ్యత ఉందని చెప్పి మూడు రాష్ట్రాలకు వాటా వేయడం మన రాష్ట్రానికి పెనుశాపమే. ఈ తీర్పు ద్వారా గతంలో కర్నాటక, మహారాష్ట్రలకు 1319టీఎంసీల కేటాయింపులుంటే, ఇప్పుడా పరిమాణం 1573 టీఎంసీలకు పెరిగింది. ఎగువ రాష్ట్రాలు ముందుగానే ఈ జలరాశిని పట్టుకుంటే దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ నోట్లో మట్టే. మిగులు జలాల ఆధారంగా రాష్ట్రంలో చేపట్టిన ప్రాజెక్టులు, కాలువలు చరిత్రలో శిథిల కట్టడాలుగా మిగిలిపోవాల్సిందే!

జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పు మన రాష్ట్రంలో దాదాపు 14జిల్లాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశముంది. మిగులు జలాల ఆధారంగానే ఈ జిల్లాలన్నింటిలో కొత్త ప్రాజెక్టులు, కాలువలు నిర్మాణంలో ఉన్నాయి. మిగులు జలాల ఆధారంగానే లక్షల ఎకరాలు సాగవుతున్నాయి. మిగులు జలాల హక్కును కాలరాస్తే, సగం రాష్ట్రానికి సాగునీళ్ళు తాగునీళ్ళు కరువవుతాయి.

## 'అంతర్'జాతీయం

- థాయ్‌లాండ్‌లో ప్రభుత్వ అనుకూల, వ్యతిరేక వర్గాల మధ్య జరిగిన ఘర్షణలలో 5మంది మృతి చెందగా 50మంది గాయపడ్డారు. థాయ్ ప్రధాని యింగ్లక్‌షినవ్రతను గద్దె దించే ప్రయత్నంలో భాగంగా థాయ్‌లాండ్‌లో ఆందోళనలు జరుగుతున్నాయి. ప్రధాని సైనిక రక్షణలో ఉన్నారు.
- ఈనెల 1వతేదీన న్యూయార్క్ సమీపంలోని బ్రోనాక్స్ ప్రాంతంలో రైలు పట్టాలు తప్పిన దుర్ఘటనలో నలుగురు ప్రయాణీకులు చనిపోగా 60మంది గాయపడ్డారు.
- మొదటి ప్రపంచ యుద్ధంలో బ్రిటన్ తరపున పోరాడి అసువులు బాసిన భారత సైనికులను 1వ తేదీ లండన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో స్మరించుకున్నారు. 2014నాటికి మొదటి ప్రపంచయుద్ధం జరిగి 100ఏళ్లు కావస్తున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.
- జపాన్ చక్రవర్తి అకిహిటో ఆయన భార్య మిషికో భారతదేశ పర్యటనకు గత నెల 31న వచ్చారు. ఆరురోజుల పాటు వీరు దేశంలో పర్యటించారు. 1960లో ఈ దంపతులు తమ హనీమూన్ కోసం భారత్ వచ్చి వుండడం విశేషం. వీరికి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ దంపతులు స్వాగతం పలికారు.
- ఉగ్రవాదాన్ని అణచివేసే ప్రయత్నంలో రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానత్వం విషయాల్లో రాజీపడే ప్రసక్తే లేదని భారత రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ పేర్కొన్నారు. గత నెల 31న న్యూఢిల్లీలో అంతర్జాతీయ న్యాయకోవిదుల మండలి, భారత న్యాయకోవిదుల మండలి, ఆలిండియా బార్ అసోసియేషన్‌లు ఉగ్రవాదంపై సదస్సును నిర్వహించాయి. ఈ సదస్సులో పాల్గొన్న రాష్ట్రపతి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న ఉగ్రదాడులు భవిష్యత్‌లో ప్రజాజీవితాలను శాసించే స్థాయిలో ఉన్నాయన్నారు.
- నిర్భయ కేసులో నిందితులైన బాలనేరస్థుడిని ఇతర నేరస్థుల్లాగే క్రిమినల్ కోర్టులో విచారించేలా ఆదేశించాలని నిర్భయ తల్లిదండ్రులు సుప్రీంకోర్టును కోరారు. ఈ నిందితుడికి జువైనల్ చట్టప్రకారం బాలన్యాయమండలి మూడేళ్ళ జైలు శిక్ష విధించింది. క్రూరమైన నేరాలు చేసిన వారిని క్రిమినల్ కోర్టులో విచారించకుండా, తగిన శిక్ష పడకుండా ఈ చట్టం రక్షిస్తుందని, ఇతర నేరస్థుల్లాగే ఇతడికీ మరణశిక్ష విధించాలని వారు కోరారు.
- భారత్, మయన్మార్ సరిహద్దు అంశంపై తక్షణం స్పందించాలని బీజేపీ అధ్యక్షుడు రాజ్‌నాథ్‌సింగ్ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు లేఖ వ్రాసారు. మణిపూర్ సెక్టార్‌లో నిర్మిస్తున్న సరిహద్దు కంచె విషయంలో జాతిప్రయోజనాలను నిర్లక్ష్యం చేస్తున్నారని, పెద్దమొత్తంలో భారత భూభాగం కంచెకు అవతలివైపు ఉంటుందని, ఈ విషయం మణిపూర్ పౌరుల్లో తీవ్ర ఆగ్రహం కలిగిస్తుందని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు.

## వార్త వ్యాఖ్య

వార్త :- కేంద్రం దుర్మార్గంగా వ్యవహరిస్తుంది.
- ఏపి ఎన్జీఓ అధ్యక్షుడు అశోక్‌బాబు.
వ్యాఖ్య :- **అంతకంటే ఘాటైన పదం వాడినా తప్పులేదు.**

వార్త :- యూపిఏ విధానాలవల్లే ధరల పెరుగుదల. - మాయావతి.
వ్యాఖ్య :- **ఆ ప్రభుత్వాన్ని కాపాడుతున్న మీకు కూడా ఇందులో వాటా ఉందిగా!**

వార్త :- తెలంగాణతో కలిసేది లేదు. - కేఇ కృష్ణమూర్తి.
వ్యాఖ్య :- **ఇప్పుడు రాష్ట్ర ప్రజల ఇష్టంతో పనిలేదు.**

వార్త :- విభజన ఆగాలంటే ఢిల్లీని స్థంభింపజేయాలి. - టి.జి.వెంకటేష్.
వ్యాఖ్య :- **అధికార దాహంతో కళ్ళు మూసుకున్న వారి ముందు ఇవేవీ పనిచేయవు.**

వార్త :- కాంగ్రెస్‌లో ఉంటే డిపాజిట్లు రావు. - రాయపాటి సాంబశివరావు.
వ్యాఖ్య :- **ఇప్పుడు డిపాజిట్ గురించేనా మీ దిగులంతా!**

వార్త :- రాయలతెలంగాణకు ఒప్పుకోం. - కోదండరాం.
వ్యాఖ్య :- **మీరొప్పుకోరని తెలిసే కదా వాళ్ళు తెచ్చేది.**

వార్త :- పరిపాలనలో ఉత్తమరాష్ట్రంగా ఏ.పి. - ఇండియాటుడే పురస్కారం.
వ్యాఖ్య :- **మిగతా రాష్ట్రాల్లో పాలన ఇంకా దరిద్రంగా ఉందన్నమాట!**

వార్త :- కర్నూలు రాజధానిగా సీమ రాష్ట్రం. - కోట్ల డిమాండ్.
వ్యాఖ్య :- **జిల్లాకో రాష్ట్రం డిమాండ్ చేస్తే సరి!**

వార్త :- రాయ్‌బరేలీపై సోనియా వరాల జల్లు.
వ్యాఖ్య :- **తనది కాదనుకున్న ఏ.పి గుండెల్లో మాత్రం గుచ్చింది ముల్లు.**

వార్త :- రాష్ట్రం కలిసున్నా, విడిపోయినా సమస్యల స్వరూపం మారదు.
- డిజిపి.
వ్యాఖ్య :- **ఈ మాత్రం దానికి విడగొట్టడం దేనికి.**

వార్త :- రతనాల సీమను నరికేస్తారా? - సమైక్యశంఖారావంలో జగన్.
వ్యాఖ్య :- **రాష్ట్రాన్నే అడ్డంగా నరికేవాళ్ళకు రాయలసీమ ఒక లెక్కా?**

వార్త :- రాయల అంటే రణమే. - కేసీఆర్.
వ్యాఖ్య :- **మీకు కావాల్సింది కూడా తెలంగాణ కాదు... రణమే.**

వార్త :- తెలంగాణకు కట్టుబడి ఉన్నాం. - ప్రధాని మన్మోహన్ స్పష్టీకరణ.
వ్యాఖ్య :- **క్యాసెట్ వేసినట్లు ఎన్నిసార్లు చెబుతారా మాట.**

వార్త :- విభజనబిల్లు అసెంబ్లీలో వీగిపోవడం ఖాయం. - లగడపాటి.
వ్యాఖ్య :- **వీగిపోయినా లాభంలేదుకదా!**

PDF Compressor Free Version



# ఎయిడ్స్ పట్ల యువత జాగ్రత్త వహించాలి

## జిల్లా కలెక్టర్ శ్రీకాంత్




ర్యాలీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్


ఎయిడ్స్ పట్ల యువత అవగాహన పెంపొందించుకుని జాగ్రత్త వహించాలని నెల్లూరు జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈనెల 1వతేదీ ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ, బహిరంగసభ జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎయిడ్స్ రహిత సమాజాన్ని స్థాపించేందుకు అన్ని శాఖలు, ప్రజలు స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలన్నారు. సంస్కారవంతమైన సమాజ స్థాపన కోసం అందరూ కృషి చేయాలన్నారు. నగరంలోని గాంధీబొమ్మ నుంచి ప్రారంభమైన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు.

ఈకార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులకు ప్రశంసాపత్రాలను అందజేసి సన్మానించారు. అదనపు జాయింట్ కలెక్టర్ బి.లక్ష్మీకాంతం డిప్యూటీ డీఎంహెచ్ఓ పద్మావతి, నెల్లూరు ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, డాక్టర్ సురేష్‌కుమార్, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# చీట్లాట బ్యాచ్ అరెస్ట్

నెల్లూరు బెక్కేమిట్టలోని ఓ రియల్‌ఎస్టేట్ కార్యాలయంపై ఈనెల 1వ తేదీ రాత్రి నాల్గవ నగర పోలీసులు దాడి చేసి చీట్లాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసారు. పోలీసుల సమాచారం మేరకు నగరానికి చెందిన ఓ వ్యక్తి రియల్ ఎస్టేట్ పేరుతో ఓ ఇంటిని బాడుగకు తీసుకుని పలు ప్రాంతాల్లో ఉన్న చీట్లాట బ్యాచ్‌ని సిండికేట్‌గా తయారుచేసి రహస్యంగా ఆ ఇంట్లో పేకాట నిర్వహిస్తున్నాడు. నెలల తరబడి ఈ యవ్వారం జరుగుతుంది. స్థానికుల సమాచారం మేరకు నాల్గవ నగర ఎస్సై ప్రభాకర్, సిబ్బందితో దాడి చేసి 11 మందిని అరెస్టు చేసి 11సెల్ ఫోన్లను, రూ.20 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. సీఐ రామరావు కేసు నమోదు చేసారు.

# వైయస్సార్ స్వర్ణయుగం రాబోతుంది



రాష్ట్రంలో రాక్షసపాలనకు తెరపడి, వైయస్సార్ స్వర్ణయుగం రాబోతుందని కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పడుగుపాడులోని వైయస్సార్‌సిపి నేత రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి నివాసంలో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ ఘనవిజయం సాధించి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రికావడం ఖాయమన్నారు. ఆయన తెచ్చే స్వర్ణయుగంలో వృద్ధులకు, వితంతువులకు, మహిళలకు, రైతులకు, చేనేత కార్మికులకు, పేదలకు, పిల్లలకు అన్ని పథకాలను వర్తింపజేసి వారి కలలు నెరవేరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ములుమూడి వినోద్‌కుమార్‌రెడ్డి, రామిరెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, నిరంజన్‌బాబురెడ్డి, సుబ్బారెడ్డి, నరసింహులురెడ్డి, సుధీర్‌రెడ్డి, కోటపూరి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయికి ఎంపికైన జిల్లా ప్రయోగం

జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జాతీయస్థాయికి జిల్లా ప్రయోగం ఎంపికైంది. ఈనెల 1, 2 తేదీల్లో రాజమండ్రిలోని ప్రకాష్ విద్యానికేతన్‌లో రాష్ట్రస్థాయి సైన్స్ కాంగ్రెస్ జరిగింది. దీనికి నెల్లూరు జిల్లా నుంచి ఎనిమిది ప్రయోగాలు పాల్గొనగా అందులోని కోవూరు మండలం ఇనమడుగుకు చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న దేవేంద్ర జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. గైడ్ టీచర్ తాన్య మార్గదర్శకంతో తయారు చేసిన "మనం తీసుకునే ఆహారంలో శక్తి విలువలు తెలుసుకోవడం" అనే అంశంకు ఈ అవార్డు వచ్చింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ సిబిఐ జేడి, ఐపియస్ అధికారి లక్ష్మీనారాయణ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈసందర్భంగా ఎన్‌సీఎస్‌ఈ కో ఆర్డినేటర్ సుధాకర్, డీఇఓ ఎం.రామలింగం, ఉపవిద్యాశాఖాధికారి మేరి చంద్రిక, జిల్లా సైన్స్ అధికారి సాంబశివలు దేవేంద్రను అభినందించారు.

# టాలెంట్ టెస్ట్‌లో నేతాజీ విద్యార్థి ప్రతిభ





నెల్లూరు ధర్గామిట్టలోని కస్తూరిబా కళా క్షేత్రంలో ఈనెల 1న మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థ నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో శ్రీనేతాజీ (ఎంఎస్ఆర్) పైలట్ హైస్కూల్ విద్యార్థులు ఇద్దరు బహుమతులు సాధించారని కరస్పాండెంట్ నేతాజీ సుబ్బారెడ్డి తెలిపారు. 10వ తరగతి విద్యార్థులైన టి.వి.ఎల్.శశాంక్ ప్రథమ స్థానంలో నిలిచి రూ.2500/-లు నగదు, మెడల్, మెమెంటో, సర్టిఫికేట్‌లు పొందగా, కె.నిఖిల కన్సొలేషన్ బహుమతి పొంది మెడల్, మెమెంటో, సర్టిఫికేట్ అందుకున్నది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నేతాజీ సుబ్బారెడ్డి, డైరెక్టర్ కె.నరేంద్రరెడ్డి, హెడ్మాస్టర్ వి.సుధాకరరావు వారిని అభినందించారు.

# సిరిగోల్డ్... తిప్పేస్తుంది బోర్డు

ఏ ఫైనాన్స్ కంపెనీ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం... డబ్బులు దండేసి బోర్డులు తిప్పేయడం సర్వసాధారణం. చరిత్ర నుండి గుణపాఠాలు నేర్చుకునే అలవాటు మనకు లేకుండా పోతుంది. మనిషి ఆశాజీవి. అతనిలోని ఆశని స్వార్థపరులు ఎప్పటికప్పుడు సొమ్ము చేసుకుం టుంటారు.

నెల్లూరు కేంద్రంగా గత 20ఏళ్ల కాలంలో పందలకొద్ది ఫైనాన్స్ కంపెనీలు వచ్చాయి. మీరు లక్ష కడితే రెండు లక్షలిస్తామంటూ ఫైనాన్స్ కంపెనీలు జనాన్ని నమ్మించాయి. ఇందులో ఒక్కో కంపెనీ ఒక్కో కాలపరిమితి పెట్టింది. ఒకరు సంవత్సరంలో రెండింతలు ఇస్తామంటే, ఇంకొందరు రెండేళ్లు, మరికొందరు మూడేళ్లకు డబుల్ ఇస్తామన్నారు. వీటన్నింటిలో జనాలు డబ్బులు కట్టారు. ఇంకా విచిత్రమేమిటంటే మీరు కట్టిన డబ్బుకు 28రోజుల్లో రెండింతలు ఇస్తామని నెల్లూరు రామ్మూర్తినగర్‌లో పెట్టిన ఓ ఫైనాన్స్ కంపెనీలో కూడా జనం లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టారు. ఈమధ్యకాలంలో మనీస్కీం గురించి తెలిసిందే! పందలకోట్ల రూపాయలు దీనికి ధారపోసారు. ఫైనాన్స్ కంపెనీలు ఇన్ని రకాలుగా మోసం చేస్తున్నా ప్రజలు ఆ మాయ నుండి బయటపడలేక పోతున్నారు.

ఈ తరహాలోనిదే సిరిగోల్డ్ ఫామ్స్ అండ్ ఎస్టేట్స్ ప్రై. లిమిటెడ్ వ్యవహారం. ప్రజల నుండి డిపాజిట్ల రూపంలో కోట్లాది రూపాయలు వసూలుచేసిన ఈ సంస్థ గడువుదాటినా డిపాజిట్ దారులకు చెల్లిస్తామన్న డబ్బు ఇవ్వకపోతుండడంతో వారిలో ఆందోళన నెలకొంది. దీంతో నెల్లూరులోని కంపెనీ కార్యాలయం ముందు బాధితులు ధర్నాకు దిగారు. తిరుపతికి చెందిన సుందరం, సత్యవేడుకు చెందిన సుధాకర్, ఒంగోలుకు చెందిన వెంకయ్యలు 2007లో కావలిలో ఈ సంస్థను ప్రారం భించారు. డిపాజిట్ల సేకరణ కోసం కమీషన్ల ఆశచూపి ఏజెంట్లను పెట్టుకున్నారు. వ్యాపారులు, ఉద్యోగులు, కూలీల నుండి రోజువారీ, నెలవారీ ఫిక్స్‌డ్ డిపాజిట్ల సేకరణ మొదలుపెట్టారు. 2009లో నెల్లూరులో కనకమహల్ ఎదురుగా కార్యాలయాన్ని ప్రారంభించారు. తర్వాత ఆత్మకూరు, గూడూరు, సత్యవేడు, పామూరు, అద్దంకి, ఒంగోలు, విజయవాడ, చెన్నై, కడప, కర్నాటకలోని గుల్బర్గాలలో కూడా తమ బ్రాంచ్‌లను ప్రారంభించారు. ఇలా అన్నిచోట్లా 10వేల మంది ఏజెంట్ల ద్వారా 2లక్షలమంది బాధితుల నుండి వంద కోట్లకుపైగా వసూలు చేసారని సమాచారం. అయితే డిపాజిట్ల ద్వారా వచ్చిన డబ్బునంతా వీళ్లు భూములపై పెట్టారు. నెల్లూరు, కడప, ప్రకాశం జిల్లాల్లో 200 ఎకరాలకుపైగా భూములు కొన్నట్లు సమాచారం.

వీళ్ళు పెట్టుబడిదారులకు 18,24,36 నెలలు, మూడేళ్లు, అయిదేళ్ల కాల పరిమితితో మెచ్యూరిటీ బాండ్లు ఇచ్చారు. తక్కువ కాలవ్యవధి ఉన్న బాండ్లకు మొదట పద్ధతిగా చెల్లింపులు చేయడంతో నమ్మకం ఏర్పడి మళ్ళీ వాళ్లే పెట్టుబడులు పెట్టారు. అయితే రియల్‌ఎస్టేట్ దారుణంగా పడిపోవడం, భూముల రేట్లు తగ్గిపోవడంతో వీళ్ల లావాదేవీలు స్థంభించిపోయినట్లు తెలుస్తుంది. దీంతో మెచ్యూరిటీ అయిన బాండ్లకు ఏడాదిగా డబ్బులు చెల్లించడం లేదు. ఏడాది కాలంగా బాధితులు కార్యాలయం చుట్టూరా తిరుగుతున్నా సంస్థ నిర్వాహకులలో స్పందన లేదు. దీంతో డిపాజిట్ దారులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. ఈ సంస్థ బోర్డు తిప్పేసి తమను ముంచేస్తుందనే భయం బాధితులను వెంటాడుతుంది.

## రాష్ట్రాన్ని కాంగ్రెస్

# అడ్డగోలుగా విభజిస్తోంది

రాష్ట్రాన్ని అడ్డగోలుగా కాంగ్రెస్ విభజించే ప్రయత్నాలు చేస్తుందని భారతీయ జనతాపార్టీ సీమాంధ్ర పరిరక్షణ సమితి ఛైర్మన్ రఘునాథబాబు విమర్శించారు. మంగళవారం నెల్లూరు మినీ బైపాస్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. సీడబ్ల్యూసీ తీర్మానము ప్రకారం 10 జిల్లాలతో కూడిన తెలంగాణను ఇవ్వడంలో ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. కొత్తగా రాయలసీమలోని రెండు జిల్లాలను కలిపి రాయల తెలంగాణ పేరుతో రాష్ట్రాన్ని విభజించడం దారుణమన్నారు. హైదరాబాద్, నీళ్ళ సమస్యలను పరిష్కరించకుండా విభజన చేయడం కాంగ్రెస్ దురాశేనన్నారు. ఈ సమావేశంలో బిజేపి రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

# 15న బీసీ గర్జన

ఈనెల 15న హైదరాబాద్ నిజాం కళాశాల మైదానంలో బీసీ గర్జన నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దేవరాల సుబ్రహ్మణ్యంయాదవ్ పేర్కొన్నారు. నెల్లూరు మినీబైపాస్ రోడ్డులోని బీసీ సంఘం కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో 64 శాతం ఉన్న బీసీలకు 150 అసెంబ్లీ, 22 పార్లమెంటు స్థానాలను కేటాయించాలన్నారు. రాష్ట్రప్రభుత్వం బీసీలను చిన్నచూపు చూస్తోందని, ఉపకార వేతనాలను, ఫీజు రీఎంబర్స్‌మెంట్‌ను సకాలంలో ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తోందని విమర్శించారు. ఛలో హైదరాబాద్‌కు రాజకీయాలకు అతీతంగా బీసీలు తరలిరావాలని చెప్పారు. సంఘం జిల్లా కార్యదర్శి ముత్యం గౌడ్, నగర అధ్యక్ష కార్యదర్శులు సమాధి శ్రీనివాసులు, జనార్ధన్‌రాజు, మైనార్టీ నాయకుడు ఖాజావలి పాల్గొన్నారు.

# మాణిక్య ప్రభు మరణం వైశ్యలోకానికి తీరనిలోటు

ఏ.పి. ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షులు పాలాది మాణిక్య ప్రభు మరణం పట్ల అంతర్జాతీయ వైశ్య సమాఖ్య ఉపాధ్యక్షులు కె.వి.చలమయ్య కార్యదర్శి తిరివీధి ప్రకాశరావులు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడి స్థాయి నుండి ఏ.పి.ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా ఎదిగి ఆర్యవైశ్య పేద విద్యార్థులకు సాయమందించే విద్యానిధికి కోటి రూపాయల నిధిని సమకూర్చారని, వారి మరణం ఆర్య వైశ్యలకు తీరనిలోటు అని వారు తెలిపారు.

## కాలధర్మం


# జలదంకి వెంకటసుబ్బారెడ్డి



తడ మండలం మాంబట్టు వాస్తవ్యుడు జలదంకి వెంకటసుబ్బారెడ్డి తన 91వయేట ఆయన రెండవ కుమారుడు, చెన్నైలోని ప్రముఖ ఆడిటర్ జె.కె.రెడ్డి ఇంట నవంబర్ 28వతేదీ రాత్రి కన్నుమూశారు.

స్వగ్రామం మాంబట్టు నుండి 1980లో ఈ కుటుంబం చెన్నైకి తరలిపోయింది. వెంకటసుబ్బారెడ్డికి ముగ్గురు కుమారులుకాగా పెద్ద కుమారుడు డా॥ జె.యస్.రెడ్డి చెన్నైలోని ప్రఖ్యాత లయోలా కాలేజీలో కెమిస్ట్రీ ప్రొఫెసర్‌గా రిటైరై ప్రస్తుతం పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ నిర్వహిస్తున్నారు. ఆయన రెండవ కుమారుడు జె.కె.రెడ్డి ఆడిటర్‌గా చెన్నైలోని తెలుగువారందరికీ సుపరిచితుడే. మూడవ కుమారుడు జె.వి. రాజారెడ్డి షార్‌లో కంట్రోలర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వెంకటసుబ్బారెడ్డి భార్య చెంగమ్మతో పాటు చెన్నైలోని జె.కె.రెడ్డి ఇంట్లో నివసించేవారు. మునుమళ్ళు మనమరాళ్ళతో పాటు మునిమనవళ్ళు మునిమనమరాళ్ళతో ఆడుకుని తన 91వయేట కన్నుమూసినారు. వెంకటసుబ్బారెడ్డి పెద్దకర్మ డిసెంబర్ 12వతేదీ నాయుడుపేట, సూళ్ళూరుపేటల మధ్య జాతీయ రహదారిపై వున్న జె.కె.రెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించడానికి కుటుంబసభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. సుబ్బారెడ్డి ఆత్మ శాంతికై ప్రార్థిస్తోంది "లాయర్"

# ఎబివి నరసింహారావు



ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక "లాయర్" పేపర్లలో జర్నలిస్టుగా సుమారు 40 సంవత్సరాలు వార్తలు అందించిన కావలి నివాసి ఎబివి నరసింహారావు(71) గతనెల 29వతేదీ రాత్రి మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఈయన బొల్లినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నరసింహారావు ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ఆంధ్రప్రభ పత్రికలలో పాత్రికేయులుగా నెల్లూరు, ఒంగోలు, గుంటూరు, భువనేశ్వర్‌లలో పనిచేశారు. తరువాత నెల్లూరులో లాయర్ వారపత్రికలో కొంతకాలం తన సేవలందించారు. అనంతరం ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా పలు పత్రికలకు వార్తలు ఇస్తుండేవారు. వీరికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఎబివి నరసింహారావు మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

PDF Compressor Free Version





ఈ నెల 1వ తేదీన నెల్లూరులోని ఇందిరాభవన్‌లో చేనేతజౌళి వస్త్రప్రదర్శనను ప్రారంభించి పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, పక్కన హ్యాండ్‌లూమ్ డైరెక్టర్ పి.చెంచలబాబుయాదవ్

# నెల్లూరు కబుర్లు

## అప్రమత్తమవుతున్న పోలీస్

రాష్ట్ర విభజన బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు కేంద్రప్రభుత్వం సన్నద్ధమవుతున్న తరుణంలో జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమవుతుంది. బిల్లు పార్లమెంటుకు వచ్చే ముందు మళ్ళీ సమైక్యాంధ్ర ఉద్యమం తలెత్తనుంది.

ఈసారి ఉద్యమం కొంత తీవ్రంగానే ఉండొచ్చు. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా చూసేందుకు ఎస్పీ రామకృష్ణ కసరత్తు చేస్తున్నారు. నగర, పట్టణ పోలీసులను, అన్ని మండలాల పోలీసులను అలర్ట్‌గా వుండమని ఆదేశించారు. ఈమేరకు ఉద్యోగ, విద్యార్థి సంఘాల జేఏసీలపై నిఘా ఉంచారు. సెలవుల్లో వున్న సిబ్బందిని కూడా విధుల్లో చేరాలని ఎస్పీ ఆదేశించారు.

## డిఎంఇ పరిధిలోకి పెద్దాసుపత్రి



ఎన్నో ఏళ్ళుగా జిల్లా ప్రజలకు వైద్య సేవలందిస్తున్న దొడ్ల సుబ్బారెడ్డి ప్రభుత్వ ప్రధాన వైద్యశాలను డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారులు త్వరలోనే స్వాధీనం చేసుకోనున్నారు. వంద ఎకరాల విస్తీర్ణంలో పెద్దాసుపత్రి ఉంది. దీని ఆవరణలోనే ఇప్పుడు ప్రభుత్వ వైద్యకళాశాలను, నూరుపడకల సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మిస్తున్నారు. కళాశాలతో పాటు ఆసుపత్రి నిర్వహణ అంతా కూడా డిఎంఇ పరిధిలోకి రానుంది.

## పార్వతీ పరమేశ్వరులకు సంగీత, నృత్యార్చన



వీణాకచేరి నిర్వహిస్తున్న ఎస్పి సతీమణి పి.వి.కామేశ్వరి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో నెల్లూరు ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల నిర్వహణలో కార్తీకమాసం సందర్భంగా చివరి సోమవారం సంగీత, నృత్యోత్సవాల్లో వీణావాదం, కూచిపూడి నృత్య కార్యక్రమాలు అలరించాయి. నెల్లూరు దర్గామిట్ట శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో జరిగిన కార్యక్రమాల్లో మొదటగా నెల్లూరు జిల్లా ఎస్పీ పివీయస్ రామకృష్ణ సతీమణీ శ్రీమతి పివీ కామేశ్వరి వీణావాదం అందరినీ ఆకట్టుకుంది. వాయిద్య సహకారం మృదంగంపై వి.శాంతి కళాధర్ అందించారు. అనంతరం చిన్నారులు శివానీ, రితీష, నేహ, రిషిక, భూమిక, శ్రీజ, విక్రంలు ప్రదర్శించిన కూచిపూడీ నృత్యాలను తమదైన హావభావాలతో చక్కగా నర్తించి అలరించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్సిపల్ సి.మునికుమార్ పర్యవేక్షించారు. నగర ప్రముఖులు పాల్గొన్నారు.

## డిఎస్పీలకు వీడ్కోలు...



బదిలీ డీఎస్పీలు బాలవెంకటేశ్వరరావు, ఇందిర, రాజమహేంద్రనాయక్‌లను సత్కరిస్తున్న జిల్లా ఎస్పీ పి.వి.యస్.రామకృష్ణ, జిల్లా న్యాయమూర్తి కనకదుర్గారావు

నెల్లూరు జిల్లాలోని వివిధ సబ్ డివిజన్లలో డిఎస్పీలుగా పనిచేస్తూ ఇటీవల బదిలీ అయిన ముగ్గురు డీఎస్పీల వీడ్కోలు సభ గత నెల 30న నెల్లూరులోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నెల్లూరు జిల్లా జడ్జి కనకదుర్గారావు పాల్గొన్నారు. బదిలీ అయిన నెల్లూరు రూరల్ డీఎస్పీ బాలవెంకటేశ్వరరావు, ఆత్మకూరు డీఎస్పీ రాజమహేంద్రనాయక్, కావలి డీఎస్పీ ఇందిరలను నెల్లూరు జిల్లా జడ్జి, ఎస్పీ రామకృష్ణలు పూలమాలలతో, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఐఆర్ఎస్ మూర్తి నెల్లూరు నగర డీఎస్పీ వెంకటనాథ్‌రెడ్డి, గూడూరు డీఎస్పీ చౌడేశ్వరి, సిఐలు, ఎసైలు పాల్గొన్నారు.

## టీడీపీ ఎస్సీసెల్ కార్యవర్గం

తెలుగుదేశంపార్టీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడిగా తిరిగి బద్దెపూడి రవీంద్ర బాబును ఎంపిక చేసారు. అలాగే ప్రధాన కార్యదర్శులుగా కోవూరు శైలేంద్రబాబు, మేరిగ రామకృష్ణ, తాళ్ళూరి వెంకట రమణయ్య, కోశాధికారిగా సి.హెచ్.సుబ్బ రామయ్యలను నియమించారు.

## బిఇడి ఫలితాల్లో బాలికల హవా

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల బిఇడి ఫలితాలను వీఎస్‌యూ పరీక్షల అధికారి ఎస్.మురళీ మోహన్ ఇటీవల విడుదల చేసారు. నెల్లూరుజిల్లా వ్యాప్తంగా 2,030 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1245 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ శ్రేణిలో 141మంది, ద్వితీయశ్రేణిలో 439మంది పాసయ్యారు. మొత్తం 61.3 శాతం ఉత్తీర్ణత సాధించగా అందులో బాలికలు 69.03, బాలురు 51.28 శాతం ఉత్తీర్ణులయ్యారు.

**నారాయణ ప్రభంజనం:**

విక్రమసింహపురి విశ్వవిద్యాలయం ఇటీవల విడుదల చేసిన బీఈడి ఫలితాల్లో నారాయణ విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో 2, 6వ ర్యాంకులను సాధించినట్లు నారాయణ బీఈడి కళాశాల ప్రిన్సిపల్ బి.భాస్కర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఎ.సరిత వియస్‌యూ పరిధిలో ద్వితీయ, కె.నాగాపూర్ణిమ 6వ స్థానంలో నిలిచారన్నారు. ఎస్.నీలిమ కళాశాల స్థాయిలో తృతీయస్థానం సాధించిందన్నారు.

## పోలీస్ కుటుంబానికి ఆర్థికసాయం

విధి నిర్వహణలో మరణించిన కానిస్టేబుల్ రమేష్‌కు నష్టపరిహారానికి సంబంధించి రావల్సిన రూ.5.10 లక్షలు అతని భార్య పుట్టమ్మకు నెల్లూరు జిల్లా జడ్జి సిహెచ్ కనకదుర్గారావు అందించారు. నెల్లూరు ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో ఇటీవల ఈ కార్యక్రమం జరిగింది. నెల్లూరు జిల్లా ధనలక్ష్మీపురం పోలీసు స్టేషన్లో రమేష్ కానిస్టేబుల్‌గా పని చేసేవాడు. ఈసంవత్సరం ఆగష్టు నెలలో విధినిర్వహణపై నెల్లూరు వస్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతని కుటుంబానికి రావల్సిన నష్టపరిహారాన్ని జిల్లా ఎస్పీ రామకృష్ణ త్వరగా వచ్చేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారుల సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.ప్రసాద్ రావు పాల్గొన్నారు.

## వీనులవిందుగా రామదాసు సంకీర్తనలహరి





నెల్లూరులోని భారతీ సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నగరంలోని టౌన్‌హాలులో చిన్నారులు ఆలపించిన రామదాసు సంకీర్తనలు భక్తిగానలహరి వీనులవిందుగా సాగింది. సంస్థ అధినేత్రి సంగీత విద్వాంసురాలు ఎ.రమాదేవి శిష్యురాండ్రు కె.లావణ్య, ఎ.హరికృష్ణ, ఎన్.హంసిని, ఎ.యతీష్, కె.శ్వేతప్రియ, యం.ఆశ్రిత సాయి, యం.హర్షితసాయి, మోక్షారెడ్డిలు ఆలపించిన పలు రామదాసు కీర్తనలు సభికులను అలరించాయి. వీరికి వాద్య సహకారాన్ని వయోలిన్ మద్దెల లోకేష్‌బాబు, వీణ పి.హేమలక్ష్మి, మృదంగం చిట్టి హరిబాబు, తబల శాంతికుమార్, తాళం వెంకటరెడ్డి, కీబోర్డు మాస్టర్ సురభి సంగీత్‌సౌరభ్‌లు అందించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డి, ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల ప్రిన్సిపల్ సి.మునికుమార్, బీసీ సంక్షేమసంఘం అధ్యక్షుడు దేవరాల సుబ్రహ్మణ్యం, సహస్ర సభాసింహం బి.వి.నరసింహం, శ్రీతల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం ఛైర్మన్ దుగ్గిశెట్టి భారతి పాల్గొని చిన్నారులకు బహుమతులు ప్రదానం చేసారు. నగర ప్రముఖులు డా॥ యనమండ్ర నాగదేవీప్రసాద్, పద్యకళా పరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్, కళాంజలి అనంత్, నాతా కృష్ణకుమార్, ఏ.లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## శిరిడిసాయికి నృత్య నీరాజనం



నెల్లూరు నగరం ట్రంకురోడ్డు గాంధీబొమ్మ వద్దనున్న శ్రీ శిరిడి సాయిబాబా మందిరంలో ఆదివారం సాయంత్రం శిరిడిసాయికి చిన్నారులు నృత్య నీరాజనాన్ని సమర్పించారు. నెల్లూరులోని శ్రీగురుకృప కళాక్షేత్రం అధినేత్రి సురభి గాయత్రి పర్యవేక్షణలో ఆమె శిష్యురాండ్రు రిషిత, దివ్య, సుదేష్ణ, శివానీలు భరతనాట్య ప్రదర్శనలు ఇచ్చి భక్తులను అలరించారు. అనంతరం శ్రీసాయినాథుని పల్లకీసేవ, శిరిడి హారతులు తదితర కార్యక్రమాలు జరిగాయి. ప్రతి ఆదివారం మందిర ఆధ్యక్షులు మన్నెం అమర్‌నాథ్‌రెడ్డి నేతృత్వంలో ఈ కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ భక్తులను ఆకట్టుకుంటున్నారు.

## పోలీసు క్యాంటీన్ ప్రారంభమయ్యింది

కొన్ని కారణాల వల్ల మొన్నటివరకు అదిగో...ఇదిగో...అంటూ దోబూచులాడిన పోలీసు సబ్సిడరీ క్యాంటీన్ ఎట్టకేలకు ప్రారంభమయ్యింది. నెల్లూరు జిల్లాలో పోలీసు జనరల్ స్టోర్స్ ఉన్నాయి. వీటిలో నిత్యావసర సరుకులు, పోలీసులకు సంబంధించిన వస్తువులు మాత్రమే ఉంటాయి. మిలటరీ క్యాంటీన్ మాదిరిగా పోలీసు కుటుంబాలకు కంపెనీ ఇన్వాయిస్ ధరలకే అన్ని వస్తువులు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పోలీసు సబ్సిడరి క్యాంటీన్‌లకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా నగరంలోని మూలాపేట పోలీసు క్వార్టర్స్ సమీపంలో 26లక్షలు వ్యయంతో క్యాంటీన్ నిర్మాణం చేపట్టారు. బుధవారం గుంటూరురేంజ్ ఐజి సునీల్‌కుమార్, ఎమ్మెల్యేలు వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిల చేతుల మీదుగా ఈ క్యాంటీన్‌ను ప్రారంభింపజేసారు.

## పశ్చిమబెంగాల్ ఎన్నికలకు ఈవీఎంల తరలింపు


రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఎన్నికలకు నెల్లూరు ఆర్డీఓ కార్యాలయంలో ఉన్న ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లను) సోమవారం ఐదు లారీల్లో తరలించారు. పశ్చిమబెంగాల్‌లోని చెరంపూర్, హుగ్లీ ప్రాంతాల పోలింగ్ కేంద్రాలకు 2300 ఈవీఎంలను పటిష్టమైన భద్రత నడుమ నెల్లూరు నుంచి తీసుకెళ్ళారు. నెల్లూరు ఆర్డీఓ పి.వి.సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి భద్రతా గది వద్ద ఈవీఎంలను పరిశీలించిన పిదప వాటిని లారీలో ఎక్కించారు.

## కొత్త రొయ్యలమార్కెట్

పెన్నానది సమీపంలో జాతీయ రహదారి పక్కన అధునాతనంగా నిర్మించిన ఆనం వెంకటరెడ్డి ఫిష్ అండ్ ప్రాన్స్ హోల్‌సేల్ మార్కెట్‌ను ఈనెల 6వతేదీ నుండి ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా ఈ మార్కెట్ ఇంతకుముందు హరనాథపురంరోడ్డులో ఉండేది. అయితే ఆ దారినపోయే వారికి ఇది ఎంతో అసౌకర్యంగా వుండేది. ఈమధ్య జరిగిన రహదారి విస్తరణ పనుల్లో ఈ మార్కెట్‌ను ఎత్తేయాల్సి వచ్చింది. ఎవరికీ ఇబ్బంది కలుగని రీతిలో పెన్నానది సమీపంలో ఈ మార్కెట్‌ను నిర్మించుకోవడం అభినందనీయం.

PDF Compressor Free Version





## డాక్టర్ సుబ్బన్న అయ్యప్పన్‌కు
# నాయుడమ్మ అవార్డు

ప్రతి ఏటా ప్రఖ్యాత శాస్త్రవేత పేరిట అందించే ప్రతిష్ఠాత్మక నాయుడమ్మ అవార్డ్‌ను 2014వ సంవత్సరానికి ప్రముఖ శాస్త్రవేత ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్ డా॥సుబ్బన్న అయ్యప్పన్‌కు ఇవ్వనున్నట్లు నెల్లూరులోని నాయుడమ్మ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆల్టర్నేటివ్స్ డైరెక్టర్ డా॥ఎ.జగదీష్ తెలిపారు. డాక్టర్ అయ్యప్పన్ బెంగుళూరు యూనివర్శిటీ నుండి డాక్టరేట్ పొందారు. వీరు ఫెలో ఆఫ్ నేషనల్ అకాడమి ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్, అకాడమి ఆఫ్ సైన్స్, ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, సొసైటీ ఆఫ్ నేచర్ కన్సర్వేటివ్స్ మొదలైన ప్రతిష్ఠాత్మక సంస్థలలో సభ్యులు. డా॥ఎస్.ఎల్.హోరా గోల్డ్ మెడల్‌తో పాటు పలు ప్రతిష్ఠాత్మక అవార్డులు అందుకున్నారు.

ఈ అవార్డును ఇదివరకే అందుకున్న ప్రముఖులలో డా॥కె.కస్తూరి రంగన్, డా॥ఆర్. నటరాజన్, డా॥ద్రోణంరాజు కృష్ణారావు, డా॥ పి.రామారావు, డా॥పి.రామచంద్రరావు, ప్రొఫెసర్ వి.ఎస్.రామమూర్తి, డా॥అనిల్ కకోద్కర్, ప్రొఫెసర్ గోవర్ధన్ మెహతా, ప్రొఫెసర్ కిరిత్ పారిఖ్, నందన్ నిలేఖని, డా॥ బెర్నార్డ్ అమదై, ఎస్.రామాదురై, ప్రొఫెసర్ టి.నెజాత్ వెటిరోగ్లు, ప్రొ॥సమీర్ బ్రహ్మచారి, వి.రాజన్న, డా॥ఎం.వై.యస్. ప్రసాద్ ఉండడం విశేషం. వచ్చే జనవరి 2014 ఆఖరివారంలో నెల్లూరులో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో 19వ డా॥ నాయుడమ్మ స్మారకోపన్యాసం చేసి నాయుడమ్మ అవార్డును డా॥ అయ్యప్పన్ అందుకోనున్నారు. ఈ అవార్డుకు ఓ మంచి శాస్త్రవేత్తను ఎంపికచేసిన నిర్వాహకులకు 'లాయర్' అభినందనలు.

సింహపురి సమాచారం

# సిద్ధమవుతున్న జెన్‌కో

## యాష్‌పాండ్ సమస్య మిగిలింది



ముత్తుకూరు మండలం నేలటూరు వద్ద నిర్మిస్తున్న 1600మెగావాట్ల సామర్థ్యంగల దామోదరం సంజీవయ్య ఏ.పి జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రం పూర్తికావచ్చింది. ఒక్క యాష్‌పాండ్ సమస్య ఇంకా మిగిలివుంది. యాష్ పాండ్ ఏర్పాటుపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ తీర్పు వెలువడాల్సివుంది. స్థానికంగా ఏర్పాటు చేస్తున్న యాష్‌పాండ్‌పై సమీపగ్రామాల ప్రజలు అభ్యంతరం పెడుతున్నారు. అయితే భూగర్భజలాలు ఏ విధంగానూ కలుషితం కాకుండా యాష్‌పాండ్ నిర్మిస్తున్నామని జెన్‌కో అధికారులు చెబుతున్నారు. యాష్‌పాండ్ సమస్య కొలిక్కివస్తే ఇక్కడ విద్యుత్ ఉత్పత్తికి అడ్డంకులు తొలిగినట్లే.

2008 ఏప్రిల్‌లో 8వేల కోట్ల రూపాయల అంచనాలతో ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టడం జరిగింది. అనుకున్న దాని ప్రకారం ఈ ఏడాది జూలైలో మొదటి యూనిట్‌ను పూర్తిచేసి 8వేల మెగావాట్ల విద్యుదుత్పాదన ప్రారంభించి ఉండాలి. పనులలో ఆలస్యం వల్ల అనుకున్న సమయానికి ఉత్పత్తి ప్రారంభం కాలేదు. యాష్‌పాండ్ పైప్‌లైన్ పనులు ఇంకా జరగాల్సివుంది. కృష్ణపట్నం పోర్టు నుండి ప్రాజెక్ట్‌కు బొగ్గును చేర్చే కన్వేయర్ బెల్టు పనులు ఇంకా ప్రారంభం కాలేదు. సీవాటర్ ఇంటేక్ ప్లాంటు, మోటార్లు, పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయి. జనవరి నాటికి ఈ పనులను పూర్తిచేసి మార్చి నుండి మొదటి యూనిట్‌లో విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలనే ప్రణాళికతో జెన్‌కో అధికారులున్నారు.

# ఓటరుగా నమోదుకావాలి -జిల్లా కలెక్టర్



ప్రజాస్వామ్యరథంను జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీకాంత్

నెల్లూరు జిల్లాలోని 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని నెల్లూరు జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ కోరారు. గత నెల 30వ తేదీ కలెక్టర్ బంగ్లా వద్ద ప్రజా హక్కును వినియోగించు కోవడం ప్రతి ఒక్కరి కర్తవ్యమన్నారు. స్వీప్ ప్రోగ్రాం ద్వారా ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు ప్రజా స్వామ్య రథాలు నియోజకవర్గాల వారీగా పర్యటించనున్నాయి. ఈనెల 10వ తేదీ వరకు ఈరథాల ద్వారా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకునే సౌలభ్యం కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, ఆర్డీఓ సుబ్రహ్మణ్యంరెడ్డి తహశీల్దార్ నరశింహులు పాల్గొన్నారు.

# రోడ్ల నిర్మాణంపై కోటంరెడ్డి ఫైర్



డిప్యూటీ కమీషనర్ భాగ్యలక్ష్మితో చర్చిస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు నగరంలో జరుగుతున్న రోడ్ల నిర్మాణ పనులపై వైయస్సార్ సిపి రూరల్ నియోజకవర్గ సమన్వయ కర్త కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఫైరయ్యారు. సోమవారం నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట పార్టీ కార్యకర్తలతో కలసి ధర్నా చేపట్టారు. రోడ్లను నాసిరకంగా నిర్మించడంతో 60 ఏళ్ళు పాటు ఉండాల్సిన సిమెంటు రోడ్లు 6నెలలకే అధ్వాన్నంగా మారుతున్నాయన్నారు. 20 ఏళ్ళు ఉండాల్సిన తారురోడ్లు 6 నెలలు కూడా ఉండడంలేదని, 20 రోజులు కూడా గడవక ముందే ఎక్కడికక్కడ గుంతలు పడ్డాయని ఆరోపించారు. కోట్ల రూపాయలు పనులు చేస్తున్న ఇద్దరు కాంట్రాక్టర్లపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అనంతరం కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కార్పొరేషన్ డిప్యూటీ కమీషనర్ భాగ్యలక్ష్మి, ఎంఇ సంపత్‌కుమార్‌లకు వినతి పత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో మాజీకౌన్సిలర్ కెవి రాఘవరెడ్డి, మాజీ కార్పొరేటర్ తాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఈ నెల 4వ తేదీన నెల్లూరు మూలాపేటలో పోలీస్ క్యాంటీన్ ప్రారంభిస్తున్న గుంటూరురేంజి ఐజి సునీల్‌కుమార్, ఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, జిల్లా ఎస్పీ పి.వి.యస్.రామకృష్ణ

ప్రఖ్యాత కవి "అద్దేపల్లి"కి...

# డా॥నాగభైరవ అవార్డు 2013



రాష్ట్రస్థాయిలో సాహితీప్రజ్ఞ కలిగిన ప్రతిభామూర్తులకు ప్రతి ఏటా ప్రదానం చేస్తున్న ప్రతిష్ఠాత్మకమైన డా॥నాగభైరవ అవార్డు ఈ ఏడు కాకినాడకు చెందిన బహుముఖ సాహిత్య కృషీవలుడు, ప్రముఖ కవి, విమర్శకులు అద్దేపల్లి రామ మోహనరావుని వరించిందని అవార్డు కమిటీ అధ్యక్షులు ప్రఖ్యాత సినీకవి వెన్నెలకంటి, ప్రధాన కార్యదర్శి, కీర్తిపురస్కారగ్రహీత చిన్ని నారాయణరావు ఈనెల 2న ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 15న నెల్లూరు పురమందిరంలో జరుగనున్న అవార్డు ప్రదానోత్సవంలో అద్దేపల్లి రామమోహన రావు ఈ గౌరవ పురస్కారాన్ని అందుకోనున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా ఈ మహోన్నత కార్యక్రమంలో నలుగురు సాహితీ దిగ్గజాలు ఈ అవార్డును అందుకొని అబ్బురపరిచారు. మేలిమైన రచనలు చేస్తున్న వారిని సహేతుకంగా గుర్తించి సత్కరించడం ఈ అవార్డు కమిటీ విశిష్టత. డా॥నాగభైరవ కీర్తిప్రతిష్ఠలను ఇనుమడించేలా ఆయన శిష్యులైన వెన్నెలకంటి, చిన్ని నారాయణరావులు వినమ్రపూర్వకంగా విశిష్టరీతిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 2009లో మల్లెమాల(ఎం.ఎస్.రెడ్డి)కు, 2010లో తనికెళ్ళభరణికి, 2011లో దర్భశయనం శ్రీనివాసాచార్యకు, 2012లో రసరాజుకు ఈ అవార్డులు ప్రదానం చేసారు. ఐదో సంవత్సరం ఈ అవార్డు ప్రదానం చేస్తున్న సందర్భంగా మరో ఐదుగురు యువసాహితీ ప్రతిభులకు నాగభైరవ స్ఫూర్తి అవార్డులను ప్రకటించారు. వాటిని జలదంకి ప్రభాకర్ (విజయవాడ), శైలజామిత్ర(హైదరాబాద్), పడలి రాధాకృష్ణ(చీరాల), షేక్ కరీముల్లా(వినుకొండ), ఉప్పుడియం వెంకటేశ్వర్లు(చెన్నై)లు ఈ అవార్డులను డిసెంబరు 15న అందుకోనున్నారు. రాష్ట్రం నలుమూలలలోని డా॥నాగ భైరవకోటేశ్వరరావు సాహిత్యాభిమానులు, నెల్లూరులోని రసజ్ఞులందరినీ అవార్డు కమిటీ ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయమని ఆహ్వానిస్తోంది.

# మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలి

## జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పందిళ్ళపల్లి అరుణమ్మ


ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న పందిళ్ళపల్లి అరుణమ్మ

ఇటీవల పొదలకూరులో కూతురు సమానురాలైన బాలికపై అత్యాచారానికి ఒడిగట్టి సభ్యసమాజం తలదించుకునేలా చేసిన కామాంధుడైన పెంపుడు తండ్రి మస్తాన్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పందిళ్ళపల్లి అరుణమ్మ జిల్లా ఎస్పీ రామకృష్ణను కలిసి వినతిపత్రం అందించారు. నిర్భయ చట్టాన్ని అమలుపరచి ఆ మానవమృగాన్ని శిక్షించి జిల్లాలోని మహిళలకు ఊరట కలిగించాలని ఆమె కోరారు. జిల్లాలో మరలా ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా వుండేలా శిక్ష విధించాలని కోరారు. కార్యక్రమంలో పద్మావతి, అనూరాధ, లక్ష్మమ్మ, సునీత, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా చివరి కార్తీక సోమవార పూజలు



కార్తీకమాసం చివరి సోమవారం నెల్లూరు నగరంలోని అన్ని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. మూలాపేటలోని శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులు తెల్లవారుజాము నుంచి పాలాభిషేకం, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆకాశదీప అవరోహణ ఉత్సవం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నెల్లూరురూరల్, నగర ఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి పాల్గొన్నారు. రాత్రి ఆలయ ఛైర్మన్ అల్లూరు గిరీష్‌రెడ్డి, కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్‌రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యుల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు ప్రదక్షిణోత్సవం జరిగింది. దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలోని మీనాక్షి సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కార్తీకదీపాలు వెలిగించి విశేషపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. రాజరాజేశ్వరి అమ్మవారు చందనాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యనిర్వహణాధికారి పాయసం నాగేశ్వరరావు, ఆలయ ధర్మకర్తల మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు రత్నంజయరాం, సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

PDF Compressor Free Version



# పనికి తిమ్మరాజులు... పదవులకు పోతురాజులు

గల్పిక

పట్టువదలని హైటెక్ విక్రమార్కుడు ఎర్లీమార్నింగ్ ఎయిట్‌ఓక్లాక్‌కల్లా నిద్రలేచాడు. ఆకలిగా వుండడంతో మురళీకృష్ణ హోటల్‌కెళ్ళి ఒకెట్ సాంబార్‌లో పాతిక ఇడ్లీలు కలుపుకుని తిని తిరిగి రూమ్‌కొచ్చాడు. కాలకృత్యాలు తీర్చుకుని ఏ.సి కూరగాయల మార్కెట్ ముందు నిలబడి షార్ నుండి వదిలిన రాకెట్‌లా దూసుకొచ్చిన ఓ ఆటోను ఎక్కి అరనిముషంలో పెద్దాసుపత్రి ముందు దిగాడు. ఆసుపత్రిలోని మార్చురీ వద్దకు వెళ్ళి రియల్‌ఎస్టేట్‌లో అప్పులపాలై ఆత్మహత్య చేసుకున్న ఓ వ్యాపారి శవాన్ని భుజానవేసుకుని బోడిగాడితోటలోని రోటరీక్లబ్ శ్మశానవాటిక వైపుకు నడవసాగాడు. అలా నడుచుకుంటూ కెవిఆర్ పెట్రోల్ బంకు సెంటర్ దాకా వెళ్ళినా శవంలోని భేతాళుడు నుండి ఎటువంటి రెస్పాన్స్ లేకపోవడంతో విక్రమార్కుడికి అనుమానమొచ్చి భేతాళ, భేతాళ అంటూ శవాన్ని తట్టాడు. అప్పుడు వెనకనుండి... విక్రమార్క నేను ఇక్కడ వున్నా... అనే పిలుపు వినిపించింది. విక్రమార్కుడు వెనక్కి తిరిగి చూసాడు. భేతాళుడు బుల్లెట్ బైక్ మీద ఉన్నాడు.

ఏంటి భేతాళ... నేను చెమటపట్టేలా నడుస్తూ నువ్వు శవంలో ఉన్నావను కుంటే ఇలా బైక్‌మీద వచ్చావ్ అని విక్రమార్కుడు అడిగాడు. అందుకు భేతాళుడు.. పాతచింతకాయ పచ్చడిలా ఎంతకాలమని పాతసిస్టం ఫాలో అవుతాం... మనకు అందుబాటులో ఉన్న సౌకర్యాలన్నింటిని ఉపయోగించుకోవాలి. ఇదిగో నువ్వు కూడా నా బైక్ ఎక్కు... బోడిగాడి తోటకు పోయేలోపు నీకు శ్రమ తెలియకుండా... 'పదవులకు పోతురాజులు... పనికి తిమ్మరాజులు' అనే లేటెస్ట్ స్టోరీని చెబుతాను అని చెప్పాడు. విక్రమార్కుడు అలాగే బైక్ ఎక్కాడు. భేతాళుడు బైక్‌ను పోనిస్తూ స్టోరీ చెప్పడం మొదలు పెట్టాడు. 2014లో రాహుల్‌గాంధీని ప్రధానిగా చూడాలనేది సోనియా గాంధీ కల. నోములు, వ్రతాలు, పూజలు, మొక్కులు వంటి అలవాట్లు ఆమెకు లేవు కాబట్టి ఆంధ్రప్రదేశ్‌ను విభజించే పని పెట్టుకుంది. రాష్ట్రాన్ని చీలిస్తే ఎన్ని సీట్లు వస్తాయనేది లెక్కేసుకుని ఆ దిశగా ముందడుగు వేసింది. సోనియా అడిగిందే తడవు అంగారక గ్రహం మీదకు ఇస్రో వదిలిన 'మామ్' ఉపగ్రహాన్నయినా వెతికి తెచ్చివ్వగల సోనియా ఉగ్రవాద భక్తులు దిగ్విజయ్‌సింగ్, సుశీల్‌కుమార్ షిండేలు. వీళ్ళ మాటలు, చేష్టలు చూస్తుంటే వీళ్ళు కేంద్రమంత్రులో, జాతీయ నాయకులో లేక పంచాయితీ వార్డుమెంబర్లో కూడా అర్థం కాదు. అంత అడ్డదిడ్డంగా మాట్లాడే ప్రబుద్ధులకు సోనియా రాష్ట్ర విభజన బాధ్యతలు అప్పగించింది. ఇక కేంద్ర కేబినెట్ రాష్ట్ర విభజన నిర్ణయాన్ని ఆమోదించాక రాష్ట్రంలో ఎవరి కొంపలు వాళ్ళు తగలబెట్టుకుంటూ తీవ్రస్థాయిలో ఉద్యమాలు చేస్తున్నారు. రాష్ట్ర విభజనకు కారణం మీరంటే మీరంటూ వివిధ రాజకీయపార్టీల నాయకులు విమర్శలు చేసుకుంటున్నారు. ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి అయితే నా హయాంలో విభజన జరగదని ఘంటాపథంగా చెబుతున్నాడు. పార్లమెంటులో విభజన బిల్లు పెట్టేముందే సీఎం పదవిని వదిలిపోవాలనేది ఆయన ఆలోచనలాగుంది. వీరంతా ఒకెత్తయితే సీమాంధ్ర కేంద్రమంత్రులు, ఎంపీలు మరోఎత్తు. రాష్ట్ర విభజనలో వీళ్ళే పావులు, పాపులు కూడా! మెగాస్టార్ చిరంజీవి, కిల్లి కృపారాణి, కిషోర్‌చంద్రదేవ్, యం.యం.పళ్ళంరాజు, పనబాక లక్ష్మి, జె.డి.శీలం, కావూరి సాంబశివరావు, కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి వంటి కేంద్రమంత్రులతో పాటు సీమాంధ్ర కాంగ్రెస్ ఎంపీలు కూడా రాష్ట్ర విభజన నిర్ణయానికి వ్యతిరేకంగా మూకుమ్మడి రాజీనామాలు చేసి ఉంటే కాంగ్రెస్ అధిష్టానం దిగొచ్చేది. ఎందుకంటే వీరందరి రాజీనామాలు ఆమోదిస్తే కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం మైనార్టీలో పడుతుంది. ప్రభుత్వమే కూలిపోయే ప్రమాదమే ఏర్పడుతుంది. కాబట్టి సీమాంధ్ర కేంద్ర మంత్రులు, ఎంపీలు మూకుమ్మడిగా రాజీనామాస్త్రం ప్రయోగించి కేంద్రాన్ని దారిలోకి తెచ్చి వుండొచ్చు.

కాని ఆ ప్రయత్నం చేయకుండా ఈరోజు తెలంగాణ ఇస్తే ఇచ్చేరు హైదరాబాద్‌ను యూటీ చేయండి అని షిండే, దిగ్విజయ్‌సింగ్‌ల కాళ్ళమీద పడి బ్రతిమలాడు కోవాల్సిన అవసరం ఏమిటి? వీళ్ళు మూకుమ్మడి రాజీనామాలతో బెదిరించి కాంగ్రెస్ అధిష్టానాన్ని తమ దారిలోకి తెచ్చుకునే అవకాశమున్నా ఆ ప్రయత్నమెందుకు చేయలేదు? ఈ ప్రశ్నకు సమాధానం తెలియకున్నా సరే చెప్పకపోయావో కాంగ్రెస్‌పార్టీ నుండి ప్రధానివై మన్మోహన్‌సింగ్‌లా మనస్సాక్షి లేకుండా పనిచేస్తావని హెచ్చరించాడు.

అప్పుడు విక్రమార్కుడు... భేతాళ... రాజీనామాలతో వీళ్ళు కాంగ్రెస్ అధిష్టానాన్ని దారిలోకి తేవడం కాదు... వీళ్ళు చేసిన రాజీనామాలతో కేంద్రమే వారిని ఆడిస్తుంది. కేంద్రం రాష్ట్ర విభజన నిర్ణయం తీసుకున్నాక ప్రజలు తంతారని భయపడి సీమాంధ్ర కేంద్రమంత్రులు, ఎంపీలు ఉత్తుత్తి రాజీనామాలు చేసారు. వీళ్ళకు పదవులంటే ప్రాణం కదా. పదవులను అంత సులభంగా వదులుకుంటారా? ఉత్తుత్తి రాజీనామా లేఖలను ప్రధానికిచ్చి వాటిని ఆయన టేబుల్ సొరుగులో భద్రంగా ఉంచారు.

ఇప్పుడు వీళ్లేదన్నా డిమాండ్ చేస్తే మీ రాజీనామాలు ఆమోదించేస్తానని ప్రధాని భయపెడుతున్నారు. తమ రాజీనామాలు ఆమోదిస్తే ఎక్కడ పదవులు పోతాయోనని వీళ్ళు కుక్కిన పేనుల్లా ఉంటున్నారు అని చెప్పాడు. ఆ సమధానంతో సంతృప్తి చెందిన భేతాళుడు విక్రమార్కుడిని అతని భుజం మీద బాడీని అక్కడే దించేసి బైక్‌తో సహా తుర్రుమన్నాడు.

---

## కదంబం

### కాలర్‌టోన్

మంత్రి కృష్ణమోహన్,
మార్కాపురం, 94410 28186.

మనుషుల సరసత్వం
కంఠంలోనేనా
కాలర్‌టోన్‌లోనూ పలుకుతుంది!

ఈ మల్లెలపొద్దు
'ఈ వారం కవిత' చదివి
సదరు కవి నంబరందుకుంటే
అతగాడి మాట అందలేదు గానీ
కమ్మని పాట వినిపించింది
కాలర్‌టోన్‌గా

'నీవేనా నను తలచినది
నీవేనా నను పిలచినది
నీవేనా నా మదిలో నిలచి
హృదయము కలవరపరచినది'.....

పైగా 'నీవేనా...నీవేనా...' అంటూ
ఎదమీటే రాగాత్మక పునరుక్తి ఒకటి!

చల్లగా మెల్లగా సాగే పాట
పదే పదే వినటమే...సరిపొయ్యింది
'కలవర పడటం' నా వంతయ్యింది!
వినా
ఎంతకీ ఫోనెత్తకుంటే ఏం చెయ్యగలం
ఎవరైనా?
నా ఆర్ద్ర స్పందనతో పాట
నా ఈ ఆశు కవితనూ
మరో ఎస్.ఎం.ఎస్‌గా
గుదిగుచ్చటం తప్ప!

(వడ్డుల శివకుమార్ గారికి)

---

## భగవద్గీత పోటీల విజేతలు

విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 1వ తేదీ నెల్లూరు నగరంలోని గుండా ఆంజనేయుల కల్యాణ మండపంలో నిర్వహించిన భగవద్గీత పోటీలు నేత్ర పర్వంగా సాగాయి. జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ గుప్తా విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర సమన్వయ కార్యదర్శి మెంటా రామమోహన్‌రావు ఈ పోటీలను ప్రారంభించారు. ఈపోటీల్లో ఎల్‌కెజి నుంచి మూడవ తరగతి వరకు జరిగిన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను కె.విష్ణు, పి.జాహ్నవి. వి.వైష్ణవిలు గెలుచుకున్నారు. 4 నుంచి 7వ తరగతి వరకు జరిగిన పోటీల్లో వరుసగా వి.సుప్రజ, మోహన్‌ప్రగతి, మనోజ్‌శ్రీలు గెలుచుకున్నారు. 8 నుంచి 10వ తరగతి వరకు జరిగిన పోటీల్లో వరుసగా పి.శివాని, ఆర్.శిరీష, ఎం.మోనీషాలు గెలుచుకున్నారు.

కళాశాల స్థాయి పోటీల్లో వి.లావణ్య, వి.కె.నిరంజన్‌లు ప్రథమ, ద్వితీయ బహుమతులను కైవసం చేసుకున్నారు. వయోజన స్త్రీల పోటీల్లో ఎం.ఉషారాణి, సిహెచ్ హేమమాలిని, డి.కె.పద్మలత, పురుషుల్లో శేషయ్య విజయం సాధించారు. ఈ కార్యక్రమంలో న్యాయనిర్ణేతలుగా ఎం.వెంకటేశ్వరరావు, ఎస్.అపర్ణ. వి.హరిత, సిహెచ్ వెంకటేశ్వరరావు, హరనాథ్, రామచంద్రయ్య, డాక్టర్ శ్రీనివాసకుమార్, చంద్రశేఖర్‌లు వ్యవహరించారు. వీహెచ్‌పీ నాయకులు గుండా ఆంజనేయుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ నేతలు మధుసూదన్, ఎస్.వెంకటేశ్వర్లు, చింతల కృష్ణమూర్తి, సుబ్బారావు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## మనోధైర్యంతో వైకల్యాన్ని అధిగమించండి

### జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్

మనోధైర్యంతో వైకల్యాన్ని అధిగమించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, వైకల్యం లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నెల్లూరు జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ కోరారు. నెల్లూరు దర్గామిట్టలోని శ్రీకస్తూర్బా కళాక్షేత్రంలో వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ వికలాంగుల దినోత్సవానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 32 వేల మంది వికలాంగులకు పింఛన్లు, ఉపాధి హామీ పథకంలో వికలాంగులకు తగిన పనిని కల్పిస్తున్నట్లు తెలిపారు. వారు ఆర్థికంగా ఎదిగేందుకు బ్యాంకుల ద్వారా రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థుల కోసం ప్రత్యేకంగా వసతి గృహాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మేనరిక వివాహాలను ప్రోత్సహించ వద్దని, శిశువు తల్లి గర్భంలో ఉన్నప్పుడే పౌష్టికాహారం అందించేందుకు, సకాలంలో టీకాలను వేసేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. అనంతరం ఆటలపోటీల్లో గెలుపొందిన వికలాంగులకు బహుమతులు అందజేసారు. అర్హత కలిగిన వికలాంగులకు సంక్షేమశాఖ ట్రై సైకిళ్ళను పంపిణీ చేసింది. ఈ కార్యక్రమంలో నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి, జాయింట్ కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, అదనపు జాయింట్ కలెక్టర్ సిహెచ్ పెంచలరెడ్డి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి వెంకటసుబ్బయ్య, డ్వామా పీడీ గౌతమి, మెప్మా పీడీ కమలకుమారి, ఆర్‌వియం పిఓ కోదండరామిరెడ్డి, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ వాణి పాల్గొన్నారు.

## నేత్ర పర్వంగా... సహస్ర దీపాలంకరణ

కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నెల్లూరు నగరంలోని కొండాయపాళెంగేటు సుజాతమ్మ కాలనీలోని అష్టలక్ష్మి ఆలయంలో ఈనెల 1వ తేదీ సహస్రకార్తీక దీపాలంకరణ సేవ నేత్రపర్వంగా జరిగింది. మహిళలు పూలతో పరమేశ్వరుని శివలింగం, ఓం, స్వస్తిక్ నమూనాలను తయారుచేసి దీపాలతో అలంకరించారు. భక్తులకు అమ్మవారు బంగారు చీర అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మ వారికి విశేషపూజలు చేసి దర్శించుకున్నారు. కన్యకపరమేశ్వరి దేవస్థానం ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, ప్రభాకరరావు, మోహనరావు, శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నగర ప్రముఖులు పాల్గొన్నారు.

## పెంచలకోనలో... సిబిఐ న్యాయమూర్తి

సోమవారం సిబిఐ కోర్టు న్యాయమూర్తి రమేష్ తన కుటుంబసభ్యులతో కలిసి పెంచలకోనలోని స్వయంభువు శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని సందర్శించారు. స్వామి, అమ్మవార్లకు ఆయన పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆలయ సాంప్రదాయంతో స్వాగతం పలికి ఆశీస్సులందజేసారు.

## విద్యార్థులకు పాటల పోటీలు

నెల్లూరులోని కొండాయపాళెం దళితవాడ నగర పాలక ప్రాథమిక పాఠశాలలో ఈనెల 3న అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పాటల పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్‌రావు, జిల్లా బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షులు దేవరాల సుబ్రహ్మణ్యంయాదవ్, విశ్రాంత వాణిజ్య పన్నులశాఖ సహాయ కమీషనర్ టంగుటూరు మహబూబ్, బి.సి సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు డి.ఆర్.ఇందిర తదితరులు వికలాంగుడైన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.భాస్కర్ రావును సత్కరించారు. తదుపరి పాటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పద్యకవి పంచాగ్నుల విశ్వేశ్వరశర్మ అసోసియేషన్ ఉపాధ్యక్షులు రవిగోగులపల్లి, [illegible] కిరణ్‌కుమార్, ఉపాధ్యాయుడు హరీష్ పాల్గొన్నారు.

PDF Compressor Free Version



# మాదిగల సింహగర్జన 12న

ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతకు ఈ నెల 12వ తేదీన మాదిగల సింహగర్జన – ఛలో ఢిల్లీ(పార్లమెంటు ముట్టడి) కార్యక్రమాల్ని జయప్రదం గావించాలని మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి(ఎంఆర్‌పిఎస్) నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం నెల్లూరు ఆమని గార్డెన్స్‌లో రాష్ట్ర కార్యవర్గ సమావేశం బద్దెపూడి నరసింహగిరి మాదిగ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ, రాష్ట్ర అధికార ప్రతినిధి జెన్ని రమణయ్య మాదిగ, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మెన్ పాల్గొని మాట్లాడారు. శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణను ఆమోదించాలని డిమాండ్ చేసారు. యూపిఏ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై 2009 ఎన్నికల్లో హామీ ఇచ్చిందని, కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఉన్న వర్గీకరణ అంశాన్ని చివరి పార్లమెంటు సమావేశాల్లో బిల్లు పెట్టాలన్నారు. ఛలోఢిల్లీ కార్యక్రమానికి ప్రతి జిల్లా నుండి 30 నుండి 40మంది వరకు ముఖ్యనాయకులు ఫోటో ఐడెంటిటీ గుర్తింపుతో సిద్ధంకావాలన్నారు. డిసెంబర్ 16 నుండి 72గంటల పాటు అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ముందు రిలే నిరాహారదీక్షలు చేపట్టాలన్నారు. 19న జాతీయరహదారిపై రాస్తారోకో చేపట్టాలని, పార్లమెంటు చివరిరోజు వరకు అవిశ్రాంతంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు రావూరు శ్రీనివాసులు మాదిగ, జిల్లా అధికార ప్రతినిధి మంద రవికుమార్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## టీటీసీ కళాశాల మంజూరు

నెల్లూరు జిల్లా నాయుడుపేటలో టీటీసీ కళాశాల ఏర్పాటుకు విద్యాశాఖ అధికారులు అనుమతిచ్చినట్లు విశ్వం ఎడ్యుకేషన్ సొసైటీ కరస్పాండెంట్ శాంతాలక్ష్మి తెలిపారు. విశ్వం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్ కళాశాల ఏర్పాటుకు అనుమతి మంజూరైనట్లు శాంతాలక్ష్మి పేర్కొన్నారు. డైట్‌సెట్ 2013లో అర్హతపొంది మొదటి విడత జరిగిన కౌన్సెలింగ్‌లో దూరప్రాంతాల్లోని కళాశాల్లో సీట్లు పొందిన వారు రెండో విడత వెబ్ కౌన్సిలింగ్‌లో పాల్గొని ఇక్కడ సీటు పొందవచ్చొన్నారు. డైట్‌సెట్ క్వాలిఫై అయినవారు, కానివారు "బి" కేటగిరి యాజమాన్య కోటా సీటును పొందవచ్చన్నారు.

## శాస్త్రసాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందాలి

### నెల్లూరు జిల్లా జడ్జి సిహెచ్ కనకదుర్గారావు




నేటి సమాజం శాస్త్రసాంకేతిక రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతోందని కాని అంతే వేగంగా మహిళలపై దాడులు కూడా అధికమయ్యాయని నెల్లూరుజిల్లా జడ్జి సిహెచ్.కనకదుర్గారావు అన్నారు. మహిళలు పిల్లలపై జరుగుతున్న నేరాలకు వ్యతిరేకంగా నెల్లూరు ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్‌హాల్లో గతనెల 31న జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో వర్క్‌షాపు జరిగింది. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ చట్టాలపై మహిళలకు అవగాహన లేకపోవడం వల్లే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మహిళలు, పిల్లలకు సంబంధించిన ప్రతి అంశానికి ఒక చట్టం ఉందన్నారు. చట్టాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత పోలీసు, న్యాయవ్యవస్థ, రెవెన్యూ, ఐసిడిఎస్ తదితర శాఖలపై ఉందన్నారు. జిల్లా ఎస్పీ రామకృష్ణ మాట్లాడుతూ మహిళలు తమకు జరిగిన అన్యాయాన్ని ధైర్యంగా చెప్పుకోగలిగినప్పుడే చట్టపరంగా బాధ్యులపై చర్యలు తీసుకునే అవకాశముందన్నారు. పోలీస్‌స్టేషన్‌కు రాలేని పరిస్థితిలో డయల్ 100ను సంప్రదిస్తే రక్షణ కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఆర్డీఓ సుబ్రహ్మణ్యంరెడ్డి, డిఇఓ మువ్వారామలింగం, ఐసిడిఎస్ పిడి విజయలక్ష్మి, జిల్లా ప్రాసిక్యూషన్ అధికారి సుబ్బలక్ష్మి, ఏఆర్ ఏఎస్పీ మూర్తి నగర డిఎస్పీ వెంకటనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు జట్టుకు మహిళా బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్

అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి సైకా మహిళా బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను నెల్లూరు జట్టు కైవసం చేసుకుంది. టోర్నీలో మొత్తం 81 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. హైదరాబాద్ జట్టు రెండవస్థానం, ఆతిథ్య అనంతపురం జిల్లా జట్టు మూడవ స్థానం దక్కించుకుంది. ఈనెల 1వ తేదీ ముగింపు కార్యక్రమానికి టీటీ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అక్బర్‌సాహెబ్, డీఎస్‌డీఓ శ్రీనివాసకుమార్, బాస్కెట్‌బాల్ సంఘం జిల్లా కార్యదర్శి కె.నరేంద్రచౌదరి, కోచ్ జగన్నాథ్‌రెడ్డి విజేతలకు ట్రోఫీలు, పతకాలు ప్రదానం చేశారు.

**రాష్ట్ర జట్టు ఎంపిక:** భోపాల్ నగరంలో ఈనెల 19 నుంచి 22 వరకు జరగనున్న జాతీయస్థాయి సైకా మహిళా బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టును జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాస కుమార్ ప్రకటించారు. ఏపీ జట్టు ఎ.జాహ్నవి, వి.జ్యోతి, ఎస్.మహాలక్ష్మి (నెల్లూరు), జి.ఇస్రత్‌తాజ్(అనంతపురం), బి.భవాని(విశాఖ), పి.సాయిలక్ష్మి (ప.గోదావరి), రుమన్, ఎన్.స్నేహప్రియ (హైదరాబాద్), ఎం.ప్రశాంతి (మహబూబ్‌నగర్).


## మేషం



అశ్వని, భరణి, కృత్తిక 1 పాదము

ఆర్థికంగా కొన్ని ఇబ్బందులుంటాయి. ఆదాయం సామాన్యంగా ఉంటుంది. వ్యాపార పరిశ్రమ యాజమాన్యాలు అవకాశాలు సరిగా ఉండవు. అవసరములకు ఎవరో ఒకరు ఆదుకుంటారు. పనులు అనుకున్న విధంగా సాగక టెన్షన్ పడుతుంటారు. ప్రభుత్వ అనుమతులందు ఆలస్యం ఉంటుంది. కుటుంబ సౌఖ్యము బాగుంటుంది. దూరప్రయాణాలుంటాయి.


## వృషభం



కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర 1, 2పాదాలు

వృత్తిపరంగా వ్యాపకము, ఆదాయం పెరగడం ఉంటుంది. వ్యాపార వర్గములకు ఆర్థికాభివృద్ధి, మంచి వాణిజ్య అవకాశాలు, ఆదాయం పెరుగుదల ఉంటుంది. ఉద్యోగ వర్గాలకు అధికారుల సహకారం, యూనియన్ సమావేశాలలో పాల్గొనడం ఉంటుంది. ఇంటా బయట గౌరవ ప్రతిష్టలు గుర్తింపు బాగుంటుంది. ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూ అవకాశాలుంటాయి.

## మిధునం



మృగశిర 3,4 పాదాలు, ఆర్ధ్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

వ్యవహారాల అనుకూలతకు బాగా కష్టపడవలసి వస్తుంది. వ్యాపార భాగస్వామ్యాలు, కొత్త పెట్టుబడులు, ఒప్పందాలు అనుకూలించగలవు. ఉద్యోగార్థులకు తమ ప్రయత్నాలు ఫలించే సమయమిది. స్థిరాస్తులు, షేర్ల మీద లాభాలుంటాయి. కోర్టు వ్యవహారాలు వాయిదా పడగలవు. వృత్తి జీవనం గల వారికి మంచి ఆదాయం, వ్యాపకం ఉంటుంది. స్థానమార్పులుంటాయి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వ్యవహారాల అనుకూలతకు బాగా కష్టపడవలసి వస్తుంది. వ్యాపార భాగస్వామ్యాలు, కొత్త పెట్టుబడులు, ఒప్పందాలు అనుకూలించగలవు. ఉద్యోగార్థులకు తమ ప్రయత్నాలు ఫలించే సమయమిది. స్థిరాస్తులు, షేర్ల మీద లాభాలుంటాయి. కోర్టు వ్యవహారాలు వాయిదా పడగలవు. వృత్తి జీవనం గల వారికి మంచి ఆదాయం, వ్యాపకం ఉంటుంది. స్థానమార్పులుంటాయి.



బ్రహ్మశ్రీ
స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 06.12.2013 నుండి తేది. 12.12.2013 వరకు

ఈ వారం మేషంలో కేతువు, మిధునంలో గురువు, కన్యలో కుజుడు, తులలో శని రాహువులు, వృశ్చికంలో రవి బుధులు, మకరంలో శుక్రుడు, మకర కుంభ మీన మేష రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము:

తేది 13 శుక్రవారం గీతా జయంతి


### ముహూర్తములు

తేది 11 బుధవారం ఉదయము గంట 9.00 నుండి గంట 11.00లోగా వ్యాపారం వివాహము గృహారంభములు. రాత్రి గంట 8.00 నుండి 10.00లోగా వివాహ గృహప్రవేశం. తేది 12 గురువారం ఉదయము గంట 9.00 నుండి గంట 11.00 లోగా వివాహ వ్యాపార గృహారంభములు. తేది 12 శుక్రవారం ఉదయము గంట 9.00 నుండి గంట 11.00లోగా వ్యాపార వివాహములు.

### మార్గశిర్శ మాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 06 | శుక్ర | చతుర్థి | రా॥గం.9.20వ॥ |
| తేది. 07 | శని | పంచమి | రా॥గం.7.00వ॥ |
| తేది. 08 | ఆది | షష్ఠి | సా॥గం.4.50వ॥ |
| తేది. 09 | సోమ | సప్తమి | సా॥గం.2.50వ॥ |
| తేది. 10 | మంగళ | అష్టమి | ప॥గం.1.07వ॥ |
| తేది. 11 | బుధ | నవమి | ప॥గం.11.46వ॥ |
| తేది. 12 | గురు | దశమి | ప॥గం.10.50వ॥ |


## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఖర్చులు పెరిగినా ఆదాయానికి తగినట్లుగా మలుచుకొంటారు. తొందర పాటు మాటలు వ్యవహారాలు చేయవద్దు. స్టాక్‌మార్కెట్ నిరుత్సాహ పరుస్తుంది. ప్రముఖులతో పరిచయాలు పబ్లిక్‌లో గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. అనుకున్న పనులు కొంత ఆందోళన కలిగించినా విజయవంతంగా పూర్తి చేస్తారు. ప్రభుత్వ అనుమతులు, కోర్టు కేసులు వాయిదా పడటం జరుగుతుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

స్థిరాస్తుల లావాదేవీలు, రావలసిన బాకీలు వాయిదా పడతాయి. పనులు సవ్యంగా జరగక ఆటంకాలు ఎదురుకాగలవు. ఋణాలు మంజూరు కాగలవు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. ఉద్యోగార్థులకు అవకాశాలు లభించగలవు. క్రొత్త పరిచయాలు అందుకొనడం జరుగుతుంది. ప్రభుత్వ అనుమతులు దొరుకుతాయి.


## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వృత్తివ్యాపారాలు ఒక మోస్తరుగాసాగుతూ ఆదాయం కూడా సామాన్యంగా ఉంటుంది. అవసరాలకు అదనపు ఖర్చులకు ఋణం చేయవలసి రావచ్చు. అనుకున్న పనులు సరిగా జరగక టెన్షన్ పడుతుంటారు. స్థిరాస్తుల క్రయ విక్రయాలు విలువైన వస్తువులు కొనడం వాయిదా వేస్తే మంచిది. ముఖ్యమైన వ్యక్తులను కలుసుకొంటారు. హామీలు మధ్యవర్తిత్వాలు చెల్లింపు విషయంలో జాగ్రత్త.


## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆర్థిక ఒడుదుడుకుల మధ్య వ్యాపార రంగం పురోగతిలో సాగుతుంది. ఆదాయం సంతృప్తికరంగా ఉండినా అదనపు ఖర్చులను నిలువరించలేరు. అవసరాలకు డబ్బు సర్దుబాటవుతూ పనులు జరిగిపోతాయి. చెల్లింపులు కొన్ని వాయిదా వేసికొంటారు. ఉద్యోగార్థులు తమకు అందివచ్చిన అవకాశాలను వాడుకొంటే మంచిది. రావలసిన బాకీలు వాయిదాపడతాయి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వృత్తి వ్యాపారాలు ఆశించిన విధంగా ఉండక నిరుత్సాహాన్ని కలిగిస్తాయి. ఆదాయం సామాన్యంగా ఉంటుంది. ప్రభుత్వ పరంగా అనుమతులు, క్రొత్త కాంట్రాక్టులు అతిశ్రమతో లభించగలవు. ఉద్యోగులకు పని భారం పెరుగుతుంది. అనుకున్న పనులను జాగ్రత్తగా జరుపుకొంటూవస్తారు. ఉద్యోగార్థులకు స్వల్ప అవకాశాలు దొరకవచ్చును.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తి వ్యాపార సంబంధములు విస్తరించగలవు. ఆదాయం పెరుగుతుంది. రావలసిన బాకీలు రాబట్టుకొనే ప్రయత్నాలు చేస్తారు. స్థిరాస్తుల లావాదేవీలు జరపడం, ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. క్రొత్త పెట్టుబడులకు, వ్యాపార భాగస్వామ్యాలకు అవకాశాలు అందుతాయి. పలుకుబడి గౌరవాలకు లోపంలేదు. అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వృత్తి వ్యాపార సంబంధములు విస్తరించగలవు. ఆదాయం పెరుగుతుంది. రావలసిన బాకీలు రాబట్టుకొనే ప్రయత్నాలు చేస్తారు. స్థిరాస్తుల లావాదేవీలు జరపడం, ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. క్రొత్త పెట్టుబడులకు, వ్యాపార భాగస్వామ్యాలకు అవకాశాలు అందుతాయి. పలుకుబడి గౌరవాలకు లోపంలేదు. అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వ్యాపారాలు లాభసాటిగా ఉండి, వృత్తి ఉపాధి పధకాలలో నిలద్రొక్కుకుంటారు. ఆదాయం పెరుగుతుంది. చేపట్టిన పనులు, సంప్రదింపుల ఫలిస్తాయి. ఉద్యోగులకు అధికారులతో సఖ్యత, పలుకుబడి బాగుంటుంది. విద్య ఉద్యోగ విషయాలలోను, సంతాన విషయంలో శ్రద్ధ చూపుతారు. ఉద్యోగార్థులకు అవకాశాలు దొరకగలవు. విలువైన వస్తువులు, పత్రాలను జాగ్రత్త పరచుకొనండి.

## భక్తిప్రపత్తులతో మట్టి కుండల దర్గా ఉత్సవం

నెల్లూరు జెండావీధిలోని కుమ్మరవీధిలో గల దర్గాలో గతనెల 30వ మట్టికుండల దర్గా ఉత్సవం భక్తిపూర్వకంగా జరిగింది. జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో దర్గా చుట్టుప్రక్కల గల ప్రదేశాలు కళకళలాడాయి. పెద్దబజారు, ట్రైకన్‌రోడ్డు, చేపలమార్కెట్ తదితర సమీప ప్రాంతాలలో సందడి సందడిగా వుండింది. ఈ ఉత్సవం విశేషం ఏమంటే మట్టికుండ దర్గా ఉత్సవంలో దర్గాలోపలికి కేవలం మహిళలకే ప్రవేశం వుండడం. వారు తమ కోర్కెలకు సంబంధించి ప్రసాదాలతో కూడిన మట్టికుండలను దర్గా నిర్వాహకులకు అందించారు. తదుపరి నిర్వహించిన గంధోత్సవాన్ని తిలకించారు. నెల్లూరు గ్రామీణ, నగర ఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి మట్టికుండల దర్గాలో పాల్గొని ఈ సందర్భంగా హజరత్ సమాధుల వద్ద ప్రార్థనలు చేసారు.

## చేనేత రంగాన్ని ప్రోత్సహించాలి

రాష్ట్రంలో 40 చేనేత సహకార సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన వస్త్రకళా హ్యాండ్‌లూమ్ మేళాను సద్వినియోగం చేసుకుని చేనేత రంగాన్ని ప్రోత్సహించాలని నెల్లూరు జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ పిలుపునిచ్చారు. చేనేత జౌళిశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 1వ తేదీ నెల్లూరులోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను కలెక్టర్ ప్రారంభించి మాట్లాడుతూ చేనేత కార్మికులను ప్రోత్సహించేందుకు ఇలాంటి ప్రదర్శనలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి వారు తయారు చేసిన ఉత్పత్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పి.చెంచలబాబు యాదవ్, వి.కమలేశ్వరరావు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

నెల్లూరు జిల్లా కోవూరు మండలం చినపడుగుపాడులోని సాయిరాం రైసుమిల్లులో 400బస్తాల రేషన్‌బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు సీజ్‌చేసారు. విజిలెన్స్ సిఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. రేషన్‌షాపులకు వెళ్ళే బియ్యం అక్రమంగా తరలిపోతున్నాయన్న సమాచారం రాగానే విజిలెన్స్ ఎస్పీ ఆదేశాలమేరకు దాడులు చేపట్టినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఏవో ధనుంజయరెడ్డి, డీటీ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

PDF Compressor Free Version



# కల్యాణ వైభవం...!



నెల్లూరుజిల్లా గత ఎస్పీ ప్రస్తుతం అప్పా జాయింట్‌డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఈతముక్కల దామోదర్ - శాంతిల కుమార్తె స్ఫూర్తి - అజయ్(హైదరాబాద్ వాస్తవ్యులు స్వర్గీయ శాఖమూరి సూరిబాబు - జయశ్రీల కుమారుడు)ల కల్యాణం నవంబర్ 28వ తేదీ హైదరాబాద్‌లోని నరేన్ గార్డెన్స్‌లో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డ్ వాస్తవ్యులు బోయిళ్ళ మస్తాన్‌రెడ్డి సోదరుని కుమారుడు తరుణ్‌కుమార్‌రెడ్డి - సింధుజ ల పరిణయం నవంబర్ 28వ తేదీ తిరుపతిలోని సింధూర కల్యాణ మండపంలో జరిగింది. కొత్తజంటకు 'లాయర్' శుభదీవెనలు.



కోవూరు మండలం చినపడుగుపాడు వాస్తవ్యులు యాలమూరు రామచంద్రారెడ్డి సోదరుని కుమారుడు యుగంధర్‌రెడ్డి - రాధికల పెళ్ళి నవంబర్ 27వ తేదీ నెల్లూరులోని సిపిఆర్ కల్యాణ మండపంలో జరిగింది. నూతనజంటకు 'లాయర్' శుభాభినందనలు.



కలవకూరు ప్రభాకర్‌రెడ్డి - సూర్యకళల కుమార్తె శ్రీనిహితారెడ్డి - శ్రీనివాసులురెడ్డి ల వివాహం నవంబర్ 22వ తేదీ నెల్లూరులోని మహేశ్వరి కల్యాణ మండపంలో వైభవంగా జరిగింది. కొత్తదంపతులకు 'లాయర్' అభినందనలు.

# వాసవి - వనితా క్లబ్‌ల వితరణ



34వ మానసిక వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఈనెల 3న నెల్లూరులోని రెడ్‌క్రాస్ భవనం ఆవరణంలో వాసవిక్లబ్, వనితా క్లబ్‌లు సంయుక్తంగా వ్యాయామ పరికరాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వాసవి క్లబ్ అధ్యక్షులు చలువాది శరణ్‌కుమార్ మాట్లాడుతూ మానసిక వికలాంగులకు తమ చేతనైన సాయం చేయాలన్న దృక్పథంతో ఈ పరికరాలను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో వనితా క్లబ్ అధ్యక్షులు ఉమారాణి, కన్వీనర్ కృష్ణవేణి, డాక్టర్ వాసవి తదితరులు పాల్గొన్నారు.

## నిలువెత్తు మానవత్వం

(మొదటిపేజీ తరువాయి)

వేమిరెడ్డిని జగన్ ఆత్మీయంగా పార్టీలోకి స్వాగతించి ఆయనకు పార్టీ కండువా కప్పారు. వేమిరెడ్డి పార్టీలో చేరుతున్న సందర్భంగా జిల్లా నుండి ఆ పార్టీ నాయకులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, మేకపాటి గౌతమ్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, బొమ్మిరెడ్డి రాఘువేంద్రరెడ్డి, డాక్టర్ బాలచెన్నయ్య తదితర నేతలు భారీగా తరలి వెళ్లారు. జిల్లాలో పేరుమోసిన రాజకీయ కుటుంబాలకు ఏ మాత్రం తీసిపోని విధంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేరుతెచ్చుకున్నారు. రాజకీయ కుటుంబాలకు మంచి, చెడు రెండూ ఉండొచ్చు. కాని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి మంచిపేరు మాత్రమే ఉంది. ఆయన రాజకీయ రంగ ప్రవేశంపై ఎంతోకాలంగా ప్రచారం జరుగుతుంది. కాని ఇంతకాలం ఆయన సేవాకార్యక్రమాలతే పరిమితమవుతూవచ్చారు.

వ్యక్తిపరంగా ఆయన వై.యస్.రాజశేఖరరెడ్డి అభిమాని. పదిమందికి మంచి చేయాలన్న స్ఫూర్తిని వై.యస్. నుండే స్వీకరించారు. వై.యస్. పాలన వల్ల రాష్ట్రానికి ఎంతో మేలు జరిగిందని, రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ లబ్ధిపొందారని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అభిప్రాయం. కాబట్టే ఆయన తనయుడు జగన్ నాయకత్వంలో ప్రజలకు తనవంతు సేవచేయాలనే లక్ష్యంతో ఆయన వైకాపాలో చేరారు. రాజ్యసభకు పంపించడం ద్వారా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి లాంటి పెద్దమనిషి సేవలను ఉపయోగించుకోవాలనే ఆలోచనలో జగన్ ఉన్నట్లు తెలుస్తుంది. వేమిరెడ్డి కూడా ఎక్కడా ప్రత్యక్షంగా పోటీచేయాలనుకోవడంలేదు.

కాని పార్టీలో ముఖ్యభూమిక పోషిస్తున్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఆలోచన మాత్రం ఇంకో విధంగా ఉన్నట్లు తెలుస్తుంది. ఉదయగిరిలో సిటింగ్ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి మీద తీవ్ర వ్యతిరేకత ఉంది. ఈసారి ఎన్నికల్లో ఆయనే అభ్యర్థి అయితే ఓడిపోతాడనే రిపోర్ట్ కూడా జగన్ చేతికి అందిందని సమాచారం. దాంతో మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఉదయగిరి నుండి పోటీ చేయాలని చూస్తున్నారు. మేకపాటి గౌతంరెడ్డి ఆత్మకూరు నుండి పోటీ చేస్తే నెల్లూరు పార్లమెంటుకు అభ్యర్థి అవసరమవుతుంది. దీనికి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నిలపాలనే ఆలోచన ఉంది. అయితే ఎన్నికలనాటికి ఇది ఏ రూపం సంతరించుకుంటుందో చూడాలి.

వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చేరికతో జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వెయ్యేనుగుల బలం వచ్చినట్లే! జగన్ క్రేజ్‌కు వేమిరెడ్డి ఇమేజ్ తోడవడంతో వైకాపాకు మరిన్ని ఓట్లు రాలినట్లే!

## బాణం ఎక్కడ..?

(మొదటిపేజీ తరువాయి)

చీల్చిచెండాడింది. తన మోకాలికి ఆపరేషన్ జరిగినా లెక్కచేయకుండా ఆమె పాదయాత్ర నిర్వహించింది. కేంద్రం తీసుకున్న రాష్ట్ర విభజన నిర్ణయానికి వ్యతిరేకంగా సమైక్యశంఖారావం పూరించింది. పలు జిల్లాల్లో సమైక్యశంఖారావం సభల ద్వారా ప్రజల్లో సమైక్య ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. మీ జగనన్న వదిలిన బాణాన్ని నేనంటూ ప్రజల మనసులను సుతిమెత్తగా హత్తుకున్న పూలబాణమైంది.

అలాంటి పూలబాణం జగన్ జైలు నుండి విడుదలయ్యాక తెరపై పెద్దగా కనిపించడం లేదు. దీని మీద పార్టీ కేడర్‌లోనూ అనుమానాలొస్తున్నాయి. పార్టీ అంతర్గత వ్యవహారాలకే ఆమె పరిమితమైందా అనే అనుమానం కూడా లేకపోలేదు. వైకాపాకు జగన్, షర్మిలలు రెండుకళ్ళు. జగన్‌శక్తి, షర్మిల యుక్తి పార్టీ పురోభివృద్ధికి ఎంతో దోహదపడతాయి. షర్మిల కూడా పార్టీ కార్యక్రమాలలో గతంలోలాగే చురుకుగా పాల్గొనాలని వై.యస్ అభిమానుల కోరిక.

## తెలంగాణ

(మొదటిపేజీ తరువాయి)

అనుకోకుండా ఎవ్వరూ ఊహించని విధంగా మధ్యలో రాయలతెలంగాణను తెరమీదకు తెచ్చారు. ఇది ఎవరూ కోరుకున్నది కాదు. దీని కోసం ఎవరూ ఉద్యమాలు చేయలేదు. కర్నూలు, అనంతపురం జిల్లాల్లో మైనార్టీ ఓట్లు ఎక్కువగా ఉన్నాయి కాబట్టి బలపడవచ్చుననే ఉద్దేశ్యంతో మజ్లీస్ అధినేత అసదుద్దీన్ ఓవైసీ, తన బస్సులకు టాక్స్ కట్టే పని తప్పిపోతుందనే స్వార్థంతో జె.సి.దివాకర్‌రెడ్డిలు మాత్రమే రాయల తెలంగాణ అడిగారు. రాయలతెలంగాణ అనేది ఎవరికీ ఆమోదయోగ్యమైంది కాదు. కర్నూలు, అనంతపురం జిల్లాల ప్రజలే తెలంగాణ వారితో కలిసుండడానికి ఒప్పుకోరు. సీమ సంస్కృతి తెలంగాణలో కలవడం కష్టం. అదీగాక రేపు రాయలతెలంగాణ రాష్ట్రం ఏర్పడితే కొత్తగా ఏర్పాటయ్యే ప్రభుత్వాలు ఈ రెండు సీమ జిల్లాలను నిర్లక్ష్యం చేసే అవకాశాలున్నాయి. ఎందుకంటే రాజకీయంగా ఆ రెండు జిల్లాల ప్రభావం తగ్గిపోతుంది. కాబట్టి ఆ రెండుజిల్లాల వాళ్ళు కూడా తెలంగాణలో కలవడానికి మేము ఇష్టపడమని ఆందోళనకు దిగారు.

రాయలతెలంగాణ ప్రతిపాదన తెచ్చి తెలంగాణ వాళ్ళను మళ్ళీ గెలికారు. రాయలతెలంగాణ వద్దంటూ అక్కడ మళ్ళీ ఆందోళనలు మొదలుపెట్టారు. రాయల తెలంగాణ ప్రతిపాదనకు సానుకూల వాతావరణం ఏర్పడకపోవడం, అటు తెలంగాణలోనూ ఇటు సీమాంధ్రలోనూ తీవ్రమైన వ్యతిరేకత రావడంతో కాంగ్రెస్ అధిష్టానం అయోమయంలో పడింది. ఇంత చేసి కూడా ఓట్ల పరంగా లాభంలేదనుకుందేమో మళ్ళీ 10జిల్లాల తెలంగాణకే మొగ్గుచూపింది. రాయల తెలంగాణ అయితే తెలంగాణ కాంగ్రెస్ నేతలు పార్టీకి దూరమయ్యే పరిస్థితులు ఉత్పన్నం కావడంతో కాంగ్రెస్ వెనక్కు తగ్గింది. అదీగాక తెలంగాణ బిల్లును సజావుగా పార్లమెంటులో గట్టెక్కించాలంటే బీజేపీ సహకారం అవసరం. రాయలతెలంగాణకు పార్లమెంటులో వ్యతిరేకంగా ఓటు వేస్తామని బీజేపీ బహిరంగా ప్రకటించిన నేపథ్యంలో కాంగ్రెస్ నిర్ణయం మారింది. ఈ దశలో తెలంగాణ ఏర్పాటు చేయకపోతే, ఎన్నికల తర్వాత ఆ ఛాన్స్ బీజేపీ కొట్టేస్తుందని భావించి కాంగ్రెస్ అనూహ్యంగా ఒరిజినల్ తెలంగాణకు ఓటు వేసింది.

తెలంగాణ బిల్లును ఇక వేగంగా ముందుకు జరిపేందుకు కేంద్రం వ్యూహం సిద్ధం చేసింది. కేబినెట్ ఆమోదించిన బిల్లు రాష్ట్రపతికి చేరుతుంది. రాష్ట్రపతి ఆమోదం తర్వాత రాష్ట్ర శాసనసభకు వస్తుంది. దీని తర్వాత పార్లమెంటుకు చేరుతుంది. బిల్లు పార్లమెంటుకు చేరేలోపే 45రోజుల్లోగా ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధానిని ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. అలాగే ఇరుప్రాంతాల మధ్య ఉన్న సమస్యలు పరిష్కరించడానికి ఇప్పుడే సమాయత్తమవుతుంది. సమస్యలు పరిష్కరించకుండా బిల్లుపై ముందుకు వెళితే పార్లమెంటులో కాంగ్రెస్‌కు మొట్టికాయలు ఖాయం.

PDF Compressor Free Version





# గూడూరు డివిజన్ వార్తలు

## ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలే

### సిఐ రవికుమార్ వెల్లడి



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న పట్టణ సిఐ కె.రవికుమార్

గూడూరు పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సిఐ కె.రవికుమార్ హెచ్చరించారు. ఒకటవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఆటోడ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ ఆటోలను నిలపకూడదని సూచించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించకుండా ఆటోలను ఉంచాలని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించేదిలేదని స్పష్టంచేశారు. రాత్రిళ్ల పట్టణంలో ఆటోలు తిరగడానికి వీల్లేదని రైల్వేస్టేషన్‌లో ఉన్న వాటికి మాత్రమే గుర్తింపుకార్డులు ఇస్తామన్నారు. ఎవరైతే గుర్తింపు కార్డులు పొందారో వారే ఆటోలను నడపాల్సి ఉంటుందన్నారు. పట్టణంలో తిరుగుతున్న ఆటోలకు పోలీసునెంబర్లు, గుర్తింపుకార్డులను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్.ఐ షేక్ షరీఫ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కాగా ఆటో కార్మిక సంఘ నాయకులు పార్కింగ్ స్థలాలను ఏర్పాటుచేయాలని పోలీసులను కోరారు.

## సిరి గోల్డ్ దుకాణంలో చోరీ



చోరీ జరిగిన తీరును పరిశీలిస్తున్న సిఐ రవికుమార్, ఎస్.ఐ షరీఫ్

గూడూరు పట్టణంలోని కుమ్మరవీధిలో ఉన్న సిరిగోల్డ్ ఇమిటేషన్ జ్యూయలరీ దుకాణంలో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఉదయాన్నే దుకాణం తెరిచేందుకు వచ్చిన యజమాని మల్లికార్జున్ దొంగతనం జరిగిన విషయాన్ని గుర్తించి ఒకటవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పట్టణ సిఐ రవికుమార్, ఎస్ఐ షరీఫ్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు దుకాణం సెల్లార్‌కు వేసి ఉన్న తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించినట్టు గుర్తించారు. దుకాణంలో ఉన్న సుమారు 74గ్రాముల బంగారు ఆభరణాలు, 20వేల విలువైన ఇమిటేషన్ ఆభరణాలు అపహరణకు గురయ్యాయని దుకాణ యజమాని వివరించారు. క్లూస్‌టీం అధికారి శివారెడ్డి బృందం సంఘటనాస్థలాన్ని పరిశీలించి నిందితుల వేలుముద్రలను సేకరించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. కాగా దీన్ని బట్టి పట్టణంలో రాత్రివేళల్లో పోలీసులు ఏ మేరకు గస్తీ నిర్వహిస్తున్నారో తేటతెల్లమవుతుందని పట్టణ ప్రజలు అంటున్నారు.

## సమస్యల పరిష్కారం బాధ్యత సర్పంచులదే





మాట్లాడుతున్న ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌రావు

గ్రామ పంచాయతీల్లో సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారమార్గం చూపాల్సిన బాధ్యత సర్పంచుల పైనే ఉందని ఎమ్మెల్యే బల్లి దుర్గా ప్రసాద్‌రావు అన్నారు. గూడూరు మండల కార్యాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించే చిల్లకూరు, గూడూరు మండలాలకు చెందిన సర్పంచుల శిక్షణ సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో ఆస్తుల వివరాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. త్రాగు నీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల ఏర్పాటుపై దృష్టిసారించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మంచినీటి ట్యాంకులను మంజూరు చేస్తున్నారని వాటి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. మూడు విడతలుగా నిర్వహించిన రచ్చబండలో ప్రజలు సమస్యలపై ఇచ్చిన అర్జీలను పరిశీలించి వాటికి పరిష్కారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో లక్ష్మణరావు, ఎంపీడీవోలు నిర్మలాదేవి, చిరంజీవి, సరళ, సుస్మిత పాల్గొన్నారు.

## అసహాయుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు...



ఆర్డీవో మధుసూదనరావుకు సమస్య వివరిస్తున్న బాధితులు

గూడూరులోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజావిజ్ఞప్తుల దినం ఆర్డీవో మధుసూదనరావు నిర్వహించారు. ఈ సందర్భంగా అసహాయుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూడడం తగదని బాధితులు వాపోయారు. తమ సమస్యలను ఆర్డీవోకు తెలిపామని వికలాంగ ధృవీకరణపత్రాలు ఉన్నప్పటికి పింఛను మంజూరు కావడంలేదని రేషన్‌కార్డులు ఇళ్లస్థలాలు కూడా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. పలుమార్లు రచ్చబండలో వినతులు ఇచ్చినా అవి కార్యరూపందాల్చలేదని ఆవేదన వ్యక్తంచేశారు. పట్టణంలో పింఛన్ల పంపిణీ తీరు అస్తవ్యస్తంగా ఉందని వారు వాపోయారు.

### గూడూరులో ఘనంగా

## కార్తీక దీపోత్సవం



కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

గూడూరు పట్టణంలోని హైస్కూల్ రోడ్డులో ఉన్న మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం చివరి సోమవారంకావడంతో కార్తీక దీపోత్సవాన్ని ఘనంగా గూడూరు పట్టణ ప్రజలు జరుపుకున్నారు. మూలస్థానేశ్వరుడ్ని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.

## భూములను పేదలకు పంచాలి

### - - ఎఐకెఎమ్ఎస్ - -





ర్యాలీ నిర్వహిస్తున్న అఖిల భారత రైతు కూలీ సంఘం

గూడూరు డివిజన్ పరిధిలోని సైదాపురం మండలంలోని చాగణం, తలుపూరు గ్రామాల్లో భూస్వాముల ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అంతకు ముందు పట్టణంలో రైతు కూలీలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా సమన్వయకర్త పోలయ్య మాట్లాడుతూ గ్రామల్లో ఖాళీగా ఉన్న సర్కారు భూములను పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు రాగయ్య, వెంకయ్య, వెంకటేశ్వర్లు, నరసింహారత్నం, తదితరులు పాల్గొన్నారు.

# మూ'వీ'క్షణం





## బుల్లితెర నుండి పెద్దతెరకు

'చిన్నారి పెళ్లికూతురు'గా బుల్లితెర ప్రేక్షకులను ఆకట్టుకున్న చిన్నారి అవికాగోర్ ఇప్పుడు పెద్దదై పెద్దతెరపై హీరోయిన్‌గా మారిపోయింది. ఇప్పటికే 'ఉయ్యాల జంపాల' చిత్రంలో నటిస్తున్న ఈమె తాజాగా నితిన్ సరసన నటించేందుకు అవకాశం వచ్చింది. ప్రేమ కథా చిత్రాలకు ఫేమస్ అయిన దర్శకుడు కరుణాకరణ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. బాలనటిగానే అదరగొట్టిన అవికా వెండితెరపై అదే రేంజ్‌లో దూసుకుపోతుంది.

## ట్విట్టర్‌లోకి తమన్నా

ప్రిన్స్ మహేశ్‌బాబు సరసన తొలిసారిగా 'ఆగడు' చిత్రంలో నటిస్తున్న పాలబుగ్గల వయ్యారి తమన్నా తాజాగా సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ ట్విట్టర్‌లో జాయిన్ అయ్యింది. డిసెంబర్ 2న ట్విట్టర్‌లో జాయినయిన ఈమె "అందరు ట్వీపుల్స్‌తో కనెక్ట్ అయ్యేందుకు ఎదురుచూస్తున్నా" అని మొదటిసారిగా ట్వీట్ చేసింది. హైదరాబాద్‌లో 'జో రివాజ్ ఫ్యాషన్‌షో'లో ర్యాంప్‌పై నడిచిన ఆమె ఆ విషయాన్ని ట్వీట్ చేసింది. కేవలం ఒక్కరోజులోనే ఆమెను ఫాలో అవుతున్న వారి సంఖ్య 5,800 దాటింది. అభిమానులకు దగ్గర కావడానికి చాలామంది తారలు చేస్తున్న పనిని గ్రహించిన తమన్నా ఎట్టకేలకు సోషల్ నెట్‌వర్క్‌లోకి వచ్చింది.



## 'అమీ'ది అదిరే అందం

భారతదేశ అత్యున్నత సినిమాటోగ్రాఫర్లలో పి.సి.శ్రీరామ్ ఒకరు. అటువంటి వ్యక్తి ప్రశంసలు అందుకుంది అమీజాక్సన్. ప్రస్తుతం శంకర్ తీస్తున్న 'మనోహరుడు' చిత్రానికి సినిమాటోగ్రఫీ చేస్తున్న శ్రీరామ్ ఆ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న అమీని ఆయన అమాంతం పొగిడేస్తూ 'అందానికి అత్యున్నత స్థానం' అని తెలిపాడు. ఈ సినిమా 2014లో విడుదల చెయ్యనున్నారు.



## మాస్‌తోనే ఇమేజ్

కుర్రకారు హీరోలు లవర్‌బాయ్, రొమాంటిక్ ఇమేజ్‌ల కంటే మాస్ ఇమేజ్ పైనే ఎక్కువ మక్కువ చూపుతున్నారు. రొమాంటిక్ హీరోలు ఎక్కువకాలం సినిమాల్లో నిలదొక్కుకోలేకపోతున్నారు. ఫ్యామిలీ ఇమేజ్ తెచ్చుకుంటే మాస్ ఇమేజ్ రావడం కష్టమవుతుంది. అందుకే నేటితరం హీరోలందరూ మాస్‌బాట పట్టారు. రామ్‌చరణ్, నాగచైతన్య, సిద్ధార్థ వంటి హీరోలు మాస్ ఇమేజ్ ప్రయత్నాల్లో ఉన్నారు.





## '1'కోసం స్టూడెంట్స్

ఎన్నో సంచలనాలకు కేంద్ర బిందువుగా మారుతున్న ప్రిన్స్ మహేష్ '1' చిత్రం ఇప్పుడు మరో సంచలనం రేపుతుంది. ఈ చిత్ర ప్రచారం కోసం ఏకంగా స్టూడెంట్స్‌నే వాడేసుకుంటున్నారు. ఈ సినిమా వరల్డ్‌వైడ్ రైట్స్‌తో పాటు శాటిలైట్ రైట్స్‌కి బాలీవుడ్ ప్రముఖ నిర్మాణసంస్థ ఎరోస్ ఇంటర్నేషనల్ దాదాపు 72కోట్లు చెల్లించి సొంతం చేసుకోవడంతో ఈ సినిమాపై మరింత హైప్ క్రియేటయ్యింది. ఈ హైప్‌కు తగ్గట్లే సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకోవడంతో నిర్మాతలు ప్రచారం కోసం కొత్తట్రిక్కులు ప్లే చేస్తున్నారు. ఇందులో భాగంగా '1'సినిమాను మరింతగా జనాల్లోకి తీసుకెళ్ళేందుకు 400పాఠశాలల్లోని స్టూడెంట్స్‌తో 'ఆర్ యు ద వన్' అంటూ ఓ స్టూడెంట్ కాంటెస్ట్‌ను ప్రారంభిస్తున్నారు. ఇందులో విజేతలైన విద్యార్థులకు ఈ నెల 19న హైదరాబాద్‌లో జరిగే ఆడియో ఫంక్షన్‌లో బహుమతులందజేస్తారు.

# మూడు స్వయంప్రతిపత్తి యూనివర్శిటీలు

జిల్లాలో విద్యారంగానికి మహర్దశ పట్టబోతుంది. సుదీర్ఘకాల చరిత్రలో ఉన్నతవిద్యకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ విద్యా రంగంలో తమకంటూ ప్రత్యేకగుర్తింపు తెచ్చుకున్న మూడు విద్యాసంస్థలకు స్వయంప్రతిపత్తి విశ్వవిద్యాలయాల హోదా రాబోతుంది.

మహిళా విద్యకు పెద్దపీట వేస్తున్న గూడూరులోని డీఆర్‌డబ్ల్యూ మహిళా కళాశాల, సాంకేతిక విద్యకు బాటలు వేసిన విద్యా నగర్‌లోని ఎన్‌బికెఆర్ విద్యాసంస్థలు, నూరేళ్ళ చరిత్ర కలిగిన కావలిలోని జవహర్‌భారతి విద్యాసంస్థలు స్వయంప్రతిపత్తి యూని వర్శిటీలు కాబోతున్నాయి.

ఉన్నతవిద్యను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర మానవ వనరుల శాఖ ఆధీనంలో నడిచే రాష్ట్రీయ ఉచాహార్ శిక్షఅభియాన్ సంస్థ దేశవ్యాప్తంగా 35విద్యాసంస్థలను ప్రత్యేక యూనివర్శిటీలుగా చేయాలని సంకల్పించింది. నాక్-ఏ గుర్తింపు కలిగిన, సుదీర్ఘ కాలంగా విద్యాబోధన చేస్తున్న విద్యాసంస్థలను ఇందుకు పరిశీ లనలోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా నుండి పై మూడు విద్యాసంస్థలను స్వయంప్రతిపత్తి యూనివర్శిటీలుగా గుర్తించేం దుకు రంగం సిద్ధమైంది. మొదటిగా గూడూరు డీఆర్‌డబ్ల్యూ కాలేజీని స్వయం ప్రతిపత్తి యూనివర్శిటీ హోదాకు క్లైన్‌క్లియరైంది.

స్వయం ప్రతిపత్తి పొందిన ప్రతి యూనివర్శిటీకి కూడా 61కోట్ల రూపాయల నిధులు మంజూరవుతాయి. దీనిలో కేంద్రం 65శాతం, రాష్ట్రం 35శాతం వాటా ఉంటుంది. ఈ నిధులతో విద్యాసంస్థలలో మౌలిక వసతులను పెంచడం, సీట్లు, కోర్సులను, అధ్యాపకులను పెంచడం చేస్తారు. ఈ విద్యాసంస్థలు విక్రమ సింహపురి యూనివర్శిటీ పరిధిలో కాకుండా సొంతంగానే కార్య కలాపాలు నిర్వర్తిస్తాయి. బోధన, పరీక్షల నిర్వహణ అంతా కూడా స్వతంత్రంగానే నిర్వహిస్తాయి. త్వరలోనే వీటికి స్వయం ప్రతిపత్తి హోదా రానున్నట్లు తెలుస్తుంది.

# కేసీఆర్‌కు మళ్లీ నిరాశే!



రాయలతెలంగాణను తెరపైకి తేవడంతో టీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మళ్లీ ఊపిరొచ్చింది. తెలంగాణ ఎక్కడొస్తుందోనని భయపడుతున్న కేసీఆర్‌కు రాయలతెలంగాణ ప్రతిపాదన ఒక ధైర్యాన్నిచ్చింది. రాష్ట్రం విడిపోదనే ఒక నమ్మకాన్ని కలిగించింది. అయితే గురువారం కేంద్ర కేబినెట్ 10జిల్లాలతో కూడిన తెలంగాణబిల్లును ఆమోదించడంతో ఆయన ఆశలు నీరుగారిపోయాయి. పేరుకు తెలంగాణ ఉద్యమ నాయకుడే అయినా కరుడుగట్టిన సమైక్యవాది కేసీఆర్. కాకపోతే దానిని బయటకు కనపడనీయడు. ఈ విషయంలో సీమాంధ్ర ప్రజలకు ద్రోహం చేసిన మన కేంద్రమంత్రులు, ఎంపీలకంటే కూడా కేసీఆర్ ఎంతో నయం. ఆయన నుండే ప్రత్యేక తెలంగాణవాదం పుట్టింది. దాని కోసం ఓ రాజకీయపార్టీనే స్థాపించాడు. ఈ రాష్ట్రంలో ఎప్పుడూ తెలంగాణ ఉద్యమం కొనసాగుతుండాలని కేసీఆర్ కోరుకున్నాడేగాని తెలంగాణ రాష్ట్రం ఏర్పడాలని ఆయన కోరుకోలేదు. తెలంగాణ కోసం ఉద్యమం జరుగుతుంటేనే అక్కడ కేసీఆర్ హీరో. ఆ ప్రాంతంలో ఆయనకు పనులు జరిగిపోతుంటాయి. ఏ మాత్రం తెలంగాణ వచ్చిందా... కేసీఆర్ జీరో. తెలంగాణ ఉద్యమం వాళ్ళ కుటుంబానికి పాడిఆవులాగా మారింది. కోట్ల రూపాయలు పిండు కున్నారు. ఇంకా పిండుకుంటూ ఉండాలంటే ఆ ఉద్యమం చల్లారకూడదు. కాని కాంగ్రెస్ తెలంగాణ ఇస్తామని ప్రకటించాక కేసీఆర్ నీరుగారి పోయాడు. ఎక్కడ తెలంగాణ ఇచ్చేస్తారోనని భయపడి సీమాంధ్రులను రెచ్చగొట్టాడు. వాళ్లన్నా ఆందోళనలు చేస్తే తెలంగాణ ప్రకటనను వెనక్కి తీసుకుంటారనేది కేసీఆర్ ధీమా. కాని సమైక్యాంధ్ర ఆందోళనలు ఉవ్వెత్తున జరిగినా కాంగ్రెస్ అధిష్ఠానం ఏ మాత్రం వెనక్కి తగ్గక పోవడంతో కేసీఆర్ గొంతులో పచ్చి వెలక్కాయపడ్డట్లయ్యింది. కాంగ్రెస్‌ను ఎలాగైనా వెనక్కి తేవాలనిచెప్పి కాంగ్రెస్‌లో తమ పార్టీ విలీనం కాదన్నాడు. పొత్తు సంగతి కూడా ఆలోచిస్తామన్నాడు. అయినా కాంగ్రెస్ తెలంగాణపై వెనక్కి తగ్గలేదు. దీంతో కేసీఆర్ దిగాలుపడి ఫామ్‌హౌస్‌లో కూర్చున్నాడు. ఈ దశలో వివిధ రాజకీయకోణాల్లో ఆలోచించి కేంద్రం రాయలతెలంగాణను వదిలింది. కేసీఆర్‌కు ఆయుధం దొరికింది. రాయలతెలంగాణ వద్దంటూ మళ్లీ ఉద్యమపాటెత్తుకున్నాడు. ఎట్టకేలకు మళ్ళీ కేంద్రం తెలంగాణనే ఆమోదించడంతో తిరిగి ఆయన నిరాశతో ఫామ్‌హౌస్‌కు పోవాల్సి వస్తుంది.

# రూరల్ విధుల్లోకి రాంబాబు



నెల్లూరు రూరల్ డిఎస్పీగా వియస్ రాంబాబు బుధవారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు సిఐడి డిఎస్పీగా పనిచేస్తున్న రాంబాబును రూరల్ డిఎస్పీగా నియమించారు. నెల్లూరు మూలాపేటలోని తన కార్యాలయంలో రాంబాబు రూరల్ డిఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన గుంటూరు రేంజ్ ఐజి పీవీ సునీల్‌కుమార్, జిల్లా ఎస్పీ సివీయస్ రామకృష్ణను మర్యాద పూర్వకంగా కలిసారు. గుంటూరు జిల్లా చెరుకుపల్లికి చెందిన రాంబాబు 1989 బ్యాచ్ ఎస్సైగా పోలీసుశాఖలో చేరారు. ఆయన మొదట నెల్లూరు జిల్లా కలిగిరిలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం చిట్రగుంట, గూడూరు, బుచ్చిరెడ్డిపాళెం, కావలి, వెంకటగిరి, నెల్లూరు మూడవ పట్టణం, నెల్లూరు రూరల్ పోలీసుస్టేషన్లలో ఎస్సైగా పని చేసారు. 2003లో సిఐగా పదోన్నతిపై నెల్లూరు నగరం, హైదరాబాద్ సిఐడిలో సంవత్సరం పాటు పని చేసారు. అనంతరం తిరుపతి సిఐడికి బదిలీపై వెళ్ళారు. నెల్లూరు నగర సిఐగా 2005-2007 వరకు పనిచేసారు. అనంతరం వివిధ ప్రాంతాల్లో పనిచేసి ఫిబ్రవరిలో డిఎస్పీ పదోన్నతిపై నెల్లూరు సిఐడికి వెళ్ళారు. ఇటీవల జరిగిన డిఎస్పీల బదిలీల్లో నెల్లూరు రూరల్ డిఎస్పీగా బదిలీ చేస్తూ డిజిపి ఉత్తర్వులు ఇచ్చారు. ఈసందర్భంగా పలువురు సిఐలు, ఎస్సైలు రాంబాబుకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు. రాంబాబు మాట్లాడుతూ నెల్లూరురూరల్ డివిజన్ పరిధిలోని పెండింగ్ కేసులు, నేరాలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

# క్రికెట్ స్టేట్ టీంకు స్వరూప్



నెల్లూరు విఆర్ కాలేజీలో ఇంటర్ మీడి యట్ రెండో సంవత్సరం చదువుతున్న టీవియస్ సాయిస్వరూప్ అండర్-16 కేటగిరి క్రింద స్టేట్ టీమ్‌కు ఎంపికైనాడు ఈనెల 9వతేది నుండి చెన్నైలో జరుగు రాష్ట్రస్థాయి పోటీలలో ఆంధ్రటీమ్ నుండి స్వరూప్ ఆడుతాడు. తమిళనాడు, కేరళ, గోవా, కర్నాటక, హైదరాబాద్ జట్టులతో జరిగే మ్యాచ్‌లలో పాల్గొని నెల్లూరుఖ్యాతి మరింత పెంచాలని విఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సివిఎస్ భాస్కర్, పిఇటి యం.రవిచంద్రబాబులు కోరారు.

# బిఇడిలో ఎన్‌బికెఆర్ హవా

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలో 2012-13 విద్యాసంవత్సరం బిఇడి పరీక్షలలో ఎన్‌బికెఆర్ బిఇడి కళా శాల విద్యార్థులు 83% ఉత్తీర్ణత సాధించ డంతో పాటు మొదటి 10ర్యాంకుల్లో 4ర్యాంకులు సాధించారని ఆ కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

# నెల్లూరులో మెరైన్ ఐజి



రాష్ట్ర మెరైన్ ఐజి కొత్తకోట శ్రీనివాసరెడ్డి గురువారం నెల్లూరుజిల్లాలోని తీరప్రాంతాన్ని సందర్శించారు. శ్రీహరికోటలోని షార్ ప్రాంతాన్ని, కృష్ణపట్నంపోర్టును సందర్శించి భద్రతాపరమైన అంశాలను పరిశీలించారు. ఉగ్రవాదులు దక్షిణ రాష్ట్రాల్లోని సముద్రతీర ప్రాంతం నుండి దేశంలోకి చొరబడే అవకాశం వుందని నిఘావర్గాలు హెచ్చ రించిన నేపథ్యంలో మన రాష్ట్రంలోని తీరప్రాంతంలో భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మెరైన్ ఐజి జిల్లాలోని తీరప్రాంతాన్ని పరిశీలించడం జరిగింది.

అమ్మ ఫర్నిచర్ మాల్
మినిబైపాస్‌రోడ్, నెల్లూరు.
- సరికొత్త, ప్రపంచస్థాయి మోడల్స్
- ఇంపోర్టెడ్ & ఇండియా ఫర్నిచర్
ఫైనాన్స్ సదుపాయము, ఆదివారం షాపు గలదు.

# 'వాసు మైండ్ క్లినిక్' ప్రారంభం



నెల్లూరు నర్తకి సెంటర్‌లో కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో విద్య నభ్యసించి లండన్‌లో 10సం॥ల అనుభవం గడించిన మానసిక వైద్యులు డా॥సి.శ్రీనివాసరావు, డా॥టి.స్వాతి సంయుక్త ఆధ్వర్యంలో నవంబర్ 29న వాసు మైండ్ క్లినిక్ ప్రారంభమైంది. నెల్లూరు జిల్లాలోనే మొట్ట మొదటి మహిళా మానసిక వైద్యురాలైన డా॥స్వాతి ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఇంటి వద్దనే చికిత్స అందిం చడం జరుగుతుందని తెలిపారు. దేశంలో ప్రతి అయిదు మందిలో ఒకరు మానసిక సమస్యలతో బాధపడుతున్నారని ఒత్తిడిలో మహిళలు ఉద్యోగాలు చేస్తూ తీవ్ర ఆందోళనలకు లోనవుతున్న వారికి ప్రత్యేక కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందని డా॥సి.శ్రీనివాసరావు తెలిపారు. ఈప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రఖ్యాత స్కిన్ స్పెషలిస్ట్ డా॥సి.భాస్కర్ రావు, పలువురు వైద్యులు, కోజేటి రఘు తదితరులు పాల్గొన్నారు.




Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY**, Executive Editor-**G.SREENIVASULU REDDY**.